

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 20-02-2026 | సంపుటి - 26 | సంచిక -272 | రూ : 4 | పేజీలు: 8


## జేఈఈ.. అడుగేస్తోంది అమ్మాయి




- మెయిన్ దరఖాస్తుల్లో ఏటా వారి సంఖ్య పెరుగుదల
- 20% సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించడమూ కారణమే

2లో



## ఇదే జోష్‌తో పనిచేయండి...

2లో

- సీఎం, మంత్రులకు అధిష్ఠానం అభినందన
- కరీంనగర్ ఫలితం గురించి మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేతలు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో 10వేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట ఇన్‌ఛార్జులను మార్చాలని సూచన
- సింగరేణి టెండర్ల వ్యవహారంపై ఆరా

## ఏఐ అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా

- ఇది మానవ చరిత్ర పరివర్తనలో భాగం : ప్రధాని
- ఏఐ భవిష్యత్తు కీలుబొమ్మలా మారదు : యూఎన్ సెక్రెటరీ జనరల్



2లో

## కర్రెగుట్టల్లో భారీ
## భారీ ఎన్‌కౌంటర్

- దేవ్‌జీ, బడే చొక్కారావుతో సహా ఐదుగురు మావోయిస్టులు మృతి..?

2లో



## యాదగిరిగుట్టకు భక్తుల వెల్లువ

2లో

- ఏడాదిలో 1.58 కోట్ల మంది సందర్శకులతో అగ్రస్థానం
- వేములవాడ, బాసరలోనూ భక్త ఝరి
- హైదరాబాద్ జూపార్క్, గోల్కొండ కోట, చార్మినార్ వద్దా రద్దీ






## విద్యా స్వేచ్ఛకు సంకెళ్లు...

2లో

- విమర్శల గొంతు నొక్కుతున్న వర్సిటీలు
- రాజకీయాలతో భ్రష్టు పడుతున్న ప్రాంగణాలు
- పాలకులకు జీ హుజూర్ అంటున్న అధికారులు

## మన జెండాలు వేరైనా.. నిబద్ధత ఒక్కటే

- నౌకాదళాల మధ్య సహకారం తప్పనిసరి
- విపత్తులను ఎదుర్కోవడం ఏ ఒక్కరితోనో సాధ్యంకాదు
- రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

2లో





## త్వరలో డీఎస్సీ

- సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల వేతనాల పెంపుదలపై చర్చిస్తామన్న మంత్రి
- తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటకలతో పోలిస్తే మన వద్ద వేతనాలు అధికంగా ఉన్నాయన్న మంత్రి
- సీజనల్ హాస్టళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్న నారా లోకేశ్

2లో

## పోలీసులపై రాంబాబు చిందులు

- అంతు చూస్తానంటూ ఎస్సైకి హెచ్చరికలు
- రాజమహేంద్రవరం, గుంటూరులో వాహనాలతో హైడ్రామా

2లో



# మన జెండాలు వేరైనా..నిబద్ధత ఒక్కటే

* **ఆసియా సభ్య దేశాల నౌకాదళాధిపతులతో రక్షణ మంత్రి సమావేశం**

విశాఖపట్నం: భాగస్వామ్య దేశాలకు చెందిన నౌకాదళాల మధ్య పరస్పర సామర్థ్యాల పెంపు, స్నేహపూర్వక వాతావరణం మరింత పెంపొందించుకోవడానికి మిలన్ 2026 ప్రయత్నిస్తుందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. 'వాతావరణ మార్పులు ప్రకృతి విపత్తులను తీవ్రతరం చేస్తున్నాయి. ఫలితంగా మానవతాదృక్పథంతో సహాయ కార్యక్రమాలు తరచూ చేపట్టాల్సి వస్తోంది. ఎంత సామర్థ్యం ఉన్నా ఏ ఒక్క నౌకాదళం కూడా ఒంటరిగా ఈ సవాళ్లను ఎదుర్కోలేదు. నౌకాదళాల మధ్య సహకారం ఎప్పటికీ తప్పనిసరి. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా నావిగేషన్.. స్వేచ్ఛ ఆధారంగా సమానమైన సముద్ర అవకాశాలు ఉండాలన్నది భారత్ అభిప్రాయం' అని మంత్రి పేర్కొన్నారు. విశాఖ తూర్పు నౌకాదళ ప్రధాన



కార్యాలయంలోని సముద్రిక ఆడిటోరియంలో గురువారం 'మిలన్2026'ను ప్రారంభించిన ఆయన పలు దేశాల నౌకాదళాధికారులు, ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. 'భారత్ నిజమైన విశ్వమిత్రగా, విశ్వసనీయ ప్రపంచ స్నేహితుడిగా సముద్ర జలాల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది. ఈ ఏడాది 74 దేశాల భాగస్వామ్యంతో సాగిన మిలన్ ఇప్పటి వరకు జరిగిన అతిపెద్ద, అత్యంత సమగ్రమైన కార్యక్రమంగా చెప్పుకోవచ్చు. ఇది భారత్‌పై నమ్మకం, బాధ్యతాయుతమైన సముద్ర భాగస్వామిగా ప్రపంచ సముద్ర సమాజం ఉంచిన విశ్వాసానికి ప్రతిబింబం. మిలన్ వంటి వేదికలు వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఒక చోట చేర్చి, పరస్పర విశ్వాసాన్ని కలిగిస్తాయి. మన నౌకలు కలిసి ప్రయాణిస్తే, సైనికులు కలిసి శిక్షణ పొందితే, అధికారులు కలిసి చర్చిస్తే భౌగోళిక, రాజకీయ పరిమితులు దాటి ఒక అవగాహన ఏర్పడుతుంది. అంతర్జాతీయ జలాల వివాదాలను పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి ఒక బలమైన సముద్రాల చట్టాన్ని తీసుకొచ్చింది. సముద్ర ఉగ్రవాదం, అక్రమ చేపల వేట, అక్రమ రవాణా, సైబర్ నేరాల ముప్పును సమైక్యంగా ఎదుర్కోవాలి' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్‌కె.త్రిపాఠి మాట్లాడుతూ ప్రపంచ నౌకాదళ నిపుణులు ఒకే లక్ష్యంతో రావడం సముద్ర భద్రతకు బలాన్నిస్తుందన్నారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా పాల్గొన్నారు.

భారత్ రక్షణ రంగంలో అభివృద్ధి చేసిన సాంకేతిక సామర్థ్యాలను భాగస్వామ్య దేశాలు అందిపుచ్చుకోవాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. మిలన్ వేడుకల్లో భాగంగా తొమ్మిది ఆసియా సభ్య దేశాల నౌకాదళాధిపతులు, ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హిందూ, పసిఫిక్ సముద్రాల్లో వ్యూహాత్మక రక్షణ అంశాలపై ఇందులో చర్చించారు.

# యాదగిరిగుట్టకుభక్తుల వెల్లువ

హైదరాబాద్: ఆధ్యాత్మికం..చారిత్రకం.. ఆహ్లాదం..ఇలా మూడు విభాగాల్లో రాష్ట్రంలో పర్యాటకం విస్తరిస్తోంది. పర్యాటకులు ఎక్కువగా ఆధ్మాత్మిక క్షేత్రాలను, చారిత్రక కట్టడాలను చూసేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఆహ్లాదకర ప్రదేశాలు, వన్యప్రాణులను భారీగానే సందర్శిస్తున్నారు. ప్రత్యేకించి యాదగిరిగుట్టలోని నారసింహ క్షేత్రంలో నిరంతరం రద్దీ కనిపిస్తోంది. సగటున రోజుకు 40 వేల పైచిలుకు భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారు. 2025 జూన్ నెలలో అత్యధికంగా 20.06 లక్షల మంది, ఆ ఏడాది కాలంలో ఏకంగా 1.58 కోట్ల మంది స్వామిని దర్శించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర ఆలయాన్ని ఆగస్టులో 18.75 లక్షల మంది సందర్శించారు. అక్షరాభ్యాసానికి ప్రసిద్ధిగాంచిన బాసర జ్ఞానసరస్వతి ఆలయాన్ని మే, జూన్ నెలల్లో 4 లక్షల మంది చొప్పున దర్శించుకున్నారు.

**టాప్-10లో చారిత్రక కట్టడాలు**

తెలంగాణ పర్యాటక శాఖ 2025 జనవరి నుంచి డిసెంబరు వరకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను సందర్శించిన పర్యాటకుల గణాంకాలను నమోదుచేసింది. ఆ ప్రకారం..టాప్ 10లోని తొలి మూడు స్థానాల్లో యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర ఆలయాలు ఉన్నాయి. ఆయా క్షేత్రాలకు ఏడాది పొడవునా భక్తులు భారీగా తరలివచ్చారు. నాలుగో స్థానంలో హైదరాబాద్ జూపార్క్ నిలిచింది. గోల్కొండ కోట, చార్మినార్ వంటి చారిత్రక కట్టడాలు తొలి 10 జాబితాలో చోటుదక్కించుకున్నాయి.

# ఇదే జోష్‌తో పనిచేయండి



దిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన రెండు అసెంబ్లీ ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ పోరులో పార్టీ మంచి ఫలితాలు సాధించడం పట్ల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తంచేశారు. సీఎం, మంత్రులు, పీసీసీ సహా కష్టపడి పనిచేసిన వారందర్నీ గురువారం అభినందించారు. గత రెండేళ్ల అంశాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించి రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని దిల్లీకి పిలిపించిన పార్టీ అగ్రనేతలు దాదాపు రెండు గంటలు చర్చించారు. ఇప్పటివరకు అన్నీ సానుకూలంగా సాగాయని, ఇకముందు కూడా కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. తొలుత మంత్రులతో సమావేశమై చర్చించిన అధిష్ఠానం పెద్దలు ఆ తర్వాత ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో విడివిడిగా సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సింగరేణి టెండర్ల వ్యవహారంపై ఆరా తీసినట్లు సమాచారం. అందరితో మాట్లాడిన సందర్భంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల అమలు.. సమ్మక్కసారలమ్మ జాతర నిర్వహణ గురించి సీతక్క, ధాన్యం కొనుగోలుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. భూభారతి, పేదలకు ఇళ్ల నిర్మాణంపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పామాయిల్ తోటల పెంపకంపై తుమ్మల నాగేశ్వరరావు, గిగ్ వర్కర్ల విధానంపై వివేక్ తదితరులు వివరించినట్లు తెలిసింది. గిగ్ వర్కర్ల చట్టం త్వరగా తీసుకురావాలి అని రాహుల్‌గాంధీ సూచించినట్లు సమాచారం. మంత్రులు చెబుతున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని ఈ పథకాల పటిష్ఠ అమలుకు తీసుకొంటున్న చర్యల గురించి మాట్లాడినట్లు తెలిసింది. సమ్మక్కసారలమ్మ చరిత్ర..ప్రభుత్వం కొత్తగా నిర్మాణాలు చేపట్టి జాతరను విజయవంతంగా నిర్వహించిన తీరు గురించి తెలుసుకొన్న రాహుల్‌గాంధీ... సమ్మక్క సారలమ్మలపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఓ చిత్రాన్ని నిర్మిస్తే బాగుంటుందని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జాతరను విజయవంతంగా నిర్వహించడంపై ఖర్గే అభినందిస్తూ.. తమనూ పిలిచి ఉంటే వచ్చేవాళ్లం కదా? అని నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు సమాచారం.

# జేఈఈ.. అడుగేస్తోంది అమ్మాయి

హైదరాబాద్: అమ్మాయైతే డాక్టర్.. అబ్బాయైతే ఇంజినీర్ అన్నది తెలుగు కుటుంబాల్లో చాలాఏళ్లుగా ఉన్న ఆలోచన. ఈ ధోరణి క్రమేణా మారుతోంది. అమ్మాయిలు సైతం జేఈఈ పరీక్షలంటే భయం లేదని నిరూపిస్తున్నారు. తాజా జేఈఈ మెయిన్ జనవరి పరీక్షలను పరిశీలిస్తే.. మొత్తం దరఖాస్తుల్లో 34.51% మంది వారివే కావడం విశేషం. కొన్నేళ్ల క్రితం ఈ పరీక్ష రాసేవారిలో యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. రాష్ట్రస్థాయిలో ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్నా.. జేఈఈ మెయిన్‌కు మాత్రం దూరంగా ఉండేవారు. ఇంజినీరింగ్‌లో అమ్మాయిలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్ఐటీలు, ఐఐటీల్లో ప్రత్యేకంగా 2018లో 14% సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించారు. 2020 నాటికి దాన్ని 20 శాతానికి పెంచారు. అప్పటి నుంచి వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. అయితే టాప్ 10 ర్యాంకులను దక్కించుకోవడంలో మాత్రం ఇంకా వెనుకబడే ఉన్నారని జేఈఈ శిక్షణ నిపుణులు చెబుతున్నారు. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కూ పోటీపడే వారి సంఖ్యతోపాటు సీట్లు సాధించే వారిలోనూ అమ్మాయిల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది.

# ఏఐ అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి

న్యూఢిల్లీ : కృత్రిమ మేథ (ఏఐ) అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో గురువారం మోడీ మాట్లాడుతూ.. 'ప్రపంచంలోని అత్యంత చారిత్రాత్మక ఏఐ సమ్మిట్‌కు మీ అందరికీ నా స్వాగతం. ప్రపంచంలోనే అతిపెద్ద టెక్ పూల్‌కు భారతదేశం కేంద్రం. భారత్‌లో ఏఐ సమ్మిట్ నిర్వహించడం గ్లోబల్ సౌత్‌కు గర్వకారణం. సిగ్నల్స్‌ను మొదట వైర్‌లైస్‌గా ప్రసారం చేసినప్పుడు ఒకరోజు మొత్తం ప్రపంచం రియల్ టైమ్‌కి అనుసంధానించబడి ఉంటుందని ఎవరూ ఊహించలేదు. కృత్రిమ మేథస్సు అనేది మానవ చరిత్ర యొక్క ఒక పరవర్తన. ఈరోజు మనం చూస్తున్నది, మనం అంచనా వేస్తున్నది దాని ప్రభావానికి ప్రారంభం మాత్రమే అని ఆయన అన్నారు. భారత్ ఏఐని ప్రయోజనకర రీతిలో చూస్తుంది. అందుకే మేము 'సర్వజన్ హితయే, సర్వజన్ సుఖయే'ను థీమ్‌గా ఎంచుకున్నాం. అందరికీ, ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌కు ప్రజాస్వామ్యబద్ధగా ఉండటానికి మనకు ఏఐ అవసరం అని అన్నారు. అలాగే ఏఐ యంత్రాలను తెలివైనవిగా మారుస్తోంది. కానీ అంతకంటే ఎక్కువగా ఇది మానవ సామర్థ్యాలను అనేక రెట్లు పెంచుతోంది అని మోడీ అన్నారు. 'ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర' సమ్మిట్‌లో యూఎన్ చీఫ్, టెక్ దిగ్గజాల ప్రసంగం

* **ఏఐ భవిష్యత్‌ను కొందరు నిర్ణయించలేరు: యూఎన్ చీఫ్**

గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు యూఎన్ సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అభినందనలు తెలియజేశారు. భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. నిజమైన ఇంపాక్ట్ అంటే జీవితాలను మెరుగుపరిచి, భూమిని రక్షించే సాంకేతికత అని అభిప్రాయపడ్డారు.

* **దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నా : సుందర్ పిచాయ్**

తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడిని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ హబ్ గిగా వాట్ స్కేల్ కంప్యూటర్, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉంటుందని అన్నారు. దీని వల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

* **ప్రతి పౌరుడికి ఏఐని అందించడమే లక్ష్యం : టాటా సన్స్ చైర్మెన్ చంద్రశేఖరన్**

ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే తదుపరి ప్రధాన మౌలిక సదుపాయం ఏఐయేనని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ అందేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు.

* **ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి : ఆంత్రోపిక్ సీఈఓ**

ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఏఐ రంగంలో భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అందుకే ఇటీవల వారంలో బెంగళూరులో తాము ఒక కార్యాలయాన్ని ప్రారంభించామని గుర్తు చేసుకున్నారు.

# పోలీసులపై రాంబాబు చిందులు

గుంటూరు: మాజీమంత్రి అంబటి రాంబాబు మరోమారు రెచ్చిపోయారు. విధుల్లో ఉన్న పోలీసుల పట్ల అంబటి, ఆయన అనుచరులు వీరంగం వేశారు. అధికారంలో ఉండగా సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలకు పింఛనుదారుల నుంచి డబ్బులు వసూలుచేసి, లాటరీ టికెట్లు అంటగట్టిన కేసులో రాంబాబుకు బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం జైలు నుంచి బుధవారం విడుదలైన ఆయన..రాత్రి నగరంలోని జక్కంపూడి గణేశ్ ఇంట్లో బస చేరారు. గురువారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి గుంటూరులోని నివాసానికి కార్లు, బైకులతో ర్యాలీగా బయలుదేరేందుకు యత్నించారు. సెక్షన్30 అమల్లో ఉన్నందున ర్యాలీలు చేపట్టవద్దని, నాలుగైదు కార్లలోనే వెళ్లిపోవాలని పోలీసులు రాంబాబుకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. అలాగైతే పాదయాత్ర చేస్తానంటూ మంకుపట్టు పట్టారు. అనంతరం పోలీసుల ఎదుట నాలుగైదు కార్లతో బయలుదేరి, తర్వాత 20 కార్లతో ర్యాలీ కొనసాగించారు.

**గుంటూరులో ట్రాఫిక్ అంతరాయాలు**

రాంబాబును ఆహ్వానిస్తూ వైకాపా శ్రేణులు గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ వద్ద ఎదురెళ్లి ఆయన వాహనాన్ని ఆపాయి. హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో మంగళగిరి గ్రామీణ ఎస్సై వెంకట్ వచ్చి.. వాహనాలను పక్కన ఆపాలని కోరారు. దీంతో అంబటి ఆగ్రహంతో ఊగిపోయారు. 'నా వాహనాలను ఆపుతావా. నీ అంతుచూస్తా'నంటూ బెదిరించారు. తనతోపాటు అనుచరుల వాహనాలన్నీ పంపాలంటూ వాదించారు. కొంతదూరం వెళ్లాక కూడా వైకాపా శ్రేణులు అంబటి వాహనాన్ని ఆపారు. అక్కడే విధుల్లో ఉన్న మంగళగిరి గ్రామీణ సీఐ ఏవీ బ్రహ్మం వచ్చి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. మళ్లీ రెచ్చిపోయిన రాంబాబు.. 'ఎక్కువ మాట్లాడితే ఇక్కడే కూర్చుంటా. చేతనైంది చేసుకో' అంటూ సీఐకి వేలుచూపించి తీవ్రస్వరంతో హెచ్చరించారు. భారీ కాన్వాయ్‌తో గుంటూరు నగరంలోకి వచ్చిన రాంబాబు బస్టాండ్ సమీపంలోనూ కొద్దిసేపు ఆగారు. నగరంపాలెంలో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం సిద్ధార్థనగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ పరిసరాల్లో వైకాపా శ్రేణులు భారీగా బాణసంచా కాల్చాయి. ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు అంబటి సతీమణి ఆయనకు దిష్టితీశారు.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రెగుట్టల దండకారణ్యంలో మళ్లీ భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ కార్యదర్శి దేవ్‌జీ లక్ష్యంగా కర్రెగుట్టల అటవీప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. కర్రెగుట్టల్లో తలదాచుకున్న మావోయిస్టులు.. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువైపులా నుంచి హోరాహోరీగా గంటల వ్యవధి కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు గుర్తించినట్లు తెలిసింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మృతుల్లో అగ్రనేతలు ఉండవచ్చని భద్రతా దళాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సౌత్ జోన్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోయిస్టులు ప్రవేశించి తల దాచుకుంటున్నట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం రెండు సంవత్సరాల క్రితం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు ఈ మార్చి 31 వరకు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ లక్ష్యం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందగా.. కేంద్ర కమిటీ సభ్యులు కేవలం దేహార్ మిశ్రా, దేవ్‌జీ, గణపతి సజీవంగా ఉన్నట్టు సమాచారం. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 15 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. ఆ జాబితాలో రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు కీలక నేత ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య, వార్త శేఖర్, జోడే రత్నబాయి, బడే చొక్కారావు కోసం భద్రతా బలగాలు కర్రెగుట్టలపై జల్లెడ పడుతున్నాయి. ఇక ఈ రెండేండ్లలో 588 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# త్వరలో డీఎస్సీ

అమరావతి: జాబ్ క్యాలెండర్ కింద త్వరలోనే డీఎస్సీ ప్రకటించనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వెనకబడిన ప్రాంతమైన కర్నూలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విద్యా, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. 'సమగ్ర శిక్షా అభియాన్'పై గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ఈశ్వరరావు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులకు.. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడుతో పోలిస్తే ఏపీలోనే జీతాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో మూడు నెలలకోసారి జీతాలిచ్చేవారు. ఇప్పుడు ఒకటో తేదీనే ఇస్తున్నాం. జీతాల పెంపు అంశాన్ని వచ్చే సమావేశంలో కేంద్రంతో చర్చిస్తాం' అని వివరించారు. కర్నూలు ప్రాంతంలో అవసరమైన మేరకు సీజనల్ వసతి గృహాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. 'యువగళం సందర్భంగా ఆదోని, ఆలూరు, మంత్రాలయం ఎంత వెనకబడి ఉన్నాయో ప్రత్యక్షంగా చూశా. కర్నూలు ప్రాంతానికి వచ్చే పరిశ్రమలకు అదనపు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. డీఎస్సీలోనూ కర్నూలు జిల్లాకు ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశాం. అయినా ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తి తక్కువగా ఉంది. ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం' అని హామీ ఇచ్చారు.

# విద్యా స్వేచ్ఛకు సంకెళ్లు

న్యూఢిల్లీ : దేశంలోని విశ్వవిద్యాలయాలు అసమ్మతికి నిలయాలుగా మారిపోతున్నాయి. విద్యా సంబంధమైన స్వేచ్ఛకు అక్కడ సంకెళ్లు పడుతున్నాయి. వాటిలో 'రద్దు'ల సంస్కృతి కొనసాగుతోంది. నటుడు, ప్రజా మేధావి నసీరుద్దీన్ షాకు ముంబయి విశ్వవిద్యాలయం పంపిన ఆహ్వానాన్ని చివరి క్షణంలో వెనక్కి తీసుకోవడాన్ని చూస్తుంటే విద్యాలయాలు ఏ విధంగా రాజకీయాలతో భ్రష్టుపడుతున్నాయో అర్థమవుతుంది. విశ్వవిద్యాలయాలలో ఇలాంటి దురదృష్టకర ఘటనలు జరగడం ఇదేమీ మొదటిసారి కాదు. వాటి లక్షణాలు, స్వభావాలు మారిపోతున్నాయి. ఒకప్పుడు అర్థవంతమైన చర్చలకు, ప్రముఖుల ప్రసంగాలకు అవి వేదికలుగా ఉండేవి. విమర్శలకు కూడా ప్రాధాన్యత లభించేది. ఇప్పుడు ఆ పరిస్థితి మచ్చుకైనా కనబడడం లేదు. సంస్థాగత 'రద్దు' సంస్కృతి బాగా పెరిగిపోయింది. వర్సిటీల పాలకులు అధికార పార్టీలకు దాసోహం అంటున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రతి దానికీ తల ఊపుతూ తమ పదవులు కాపాడుకుంటున్నారు.

**నిరంతర నిర్బంధాలు**

గత దశాబ్ద కాలంగా దేశంలో జరుగుతున్న వరుస సంఘటనలలో భాగంగానే ముంబయి ఉదంతాన్ని కూడా చూడాల్సి ఉంటుంది. 'క్రిటికల్ ఫిలాసఫీ ఆఫ్ క్యాస్ట్ అండ్ రేస్' పేరిట ఇటీవల న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓ సమావేశం జరిగింది. అయితే అది తీవ్రమైన రాజకీయ ఒత్తిడిని, పాలనా యంత్రాంగం నుంచి అడ్డంకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. సమావేశంలో కులం, జాతి గురించి ఎందుకు చర్చించాల్సి వచ్చిందో, దాని వెనుక ఉన్న ఉద్దేశమేమిటో తెలుసుకునేందుకు నిజ నిర్ధారణ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. అదే విధంగా సామాజిక శాస్త్రవేత్త నందినీ సుందర్ సెమినార్ సిరీస్‌కు ఢిల్లీ యూనివర్సిటీ అనుమతి నిరాకరించింది. 'భూమి, ఆస్తి, ప్రజాస్వామ్య హక్కులు' పేరిట సెమినార్ సిరీస్ జరగాల్సి ఉంది. ఈ ఘటనలను గమనిస్తే విశ్వవిద్యాలయాలలో సెన్సార్‌షిప్ అనేది ఏ విధంగా అమలవుతున్నదో అర్థమవుతుంది. విద్యా సంబంధమైన స్వేచ్ఛను నీరుకార్చడంతో పాటు దానిని హరిస్తున్నారు.

# అమ్మవారి ఆలయ వార్షికోత్సవ గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్



(ప్రజాస్ఫూర్తి, రంగారెడ్డి జిల్లా) శ్రీ వన దుర్గా దేవి అమ్మవారి దేవాలయ 3 వ వార్షికోత్సవ గోడ పత్రికను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్ లోని తన కార్యాలయం లో జిల్లా రెవిన్యూ అధికారి సంగీత, పరిపాలన అధికారి సునీల్ నాతని లతో కలిసి విడుదల చేశారు. ఇట్టి వార్షికోత్సవానికి జిల్లా కలెక్టర్, మరియు జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పరిపాలన అధికార్లను ఆహ్వానించారు.ఈ కార్యక్రమనికి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలు




ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా సంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా అద్దేపల్లి వెంకట శివరామకృష్ణ శాస్త్రి,సురభి కొండలరావు,సింధూరి, కంబాల శ్రీనివాసరావు వ్యవహరించినారు. ఈ కార్యక్రమం లో బాబు నాయక్ జనరల్ సెక్రెటరీ వి.రాంబాబు సూపరింటెంట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఓ.ఎం.సి. ఖమ్మం శ్రీనివాస చారి, సూపరింటెంట్ ఆఫ్ ఇంజనీర్ ఖమ్మం ఆపరేషన్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ జగన్నాథం,ఏ.ఇ. డిఈలు వి.కృష్ణారావు, నాగరత్నం సి.హెచ్. రామకృష్ణ భక్త రామదాసు కళాక్షేత్రం, అవుట్ డోర్ సెక్రెటరీ పి.వి. అప్పారావు, ఇండోర్ సెక్రెటరీ అశోక్, కోశాధికారి, సాంస్కృతిక సెక్రటరీ డి. సాంబశివరావు,మహిళా ప్రతినిధి జి.కవిత, సురేష్,సురేందర్ రెడ్డి,ఓవరాల్ టోర్నమెంట్ ఇంచార్జ్ గుడిమెట్ల మధు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# జిల్లా ఎస్.పి సునీతా రెడ్డితో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బేటి

* **నిష్పక్షపాతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి**
* **సానుకూలంగా స్పందించిన ఎస్.పి**



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గురువారం జిల్లా ఎస్.పి సునీతా రెడ్డి తో భేటీ అయ్యారు. పలు అంశాలను ఎస్పి దృష్టికీ తీసుకెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి బి.ఆర్.ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండు సంవత్సరాలు గడిచిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో విచారణ వేగవంతం చేసి శ్రీధర్ రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఎస్పి పి ద్రుష్టి కి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రత్యేక పరిస్థితుల్లో కింది స్థాయి అధికారులు ఒత్తిడులకు ప్రభావితమై తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం, అవసరం లేకున్నా వేధించడం చేస్తున్న విషయాన్నీ ఆమె దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఎస్.పి సునీతా రెడ్డి సానుకూలంగా స్పందించారాని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్స్, మాజీ చైర్మన్ కరుణశ్రీ, శివప్రసాద్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కర్రెస్వామి, శివరామ్ రెడ్డి, దొడ్ల రాములు, ఎద్దుల సాయికుమార్, జాత్రు నాయక్, సయ్యద్ జమీల్, తదితరులు పాల్గొన్నారు.

# న్యూ లయోలా హైస్కూల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



హన్మకొండ, ప్రజాస్ఫూర్తి : హనుమకొండ, కుమార్ పల్లి లోని న్యూ లయోలా హై స్కూల్లో వీర శివాజీ ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్, ప్రిన్సిపల్ కర్రె చంద్రశేఖర్ లు ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. తాడిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ విరోచిత పోరాటం ఈ దేశం పట్ల, మహిళలపై గౌరవం, ఆత్మగౌరవ పోరాటం సమానత్వం అన్ని వివరించడం జరిగింది. వీర శివాజీ చరిత్ర తెలుసుకొని వారిలా దేశం పట్ల ప్రేమను పెంచుకోవాలని దేశ అభివృద్ధి కోసం విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆల్విన్ కాలనీలో 'టాక్స్' దందాగిరి



* **బిల్ కలెక్టర్ వసూళ్ల దందా**

**ప్రజాస్ఫూర్తి, హైదర్ నగర్:** సైబరాబాద్ మున్సిపల్ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ అడ్డగుట్టలో ట్యాక్స్ బిల్ కలెక్టర్ పెత్తనం హద్దులు మీరుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, పౌరుల జేబులకు చిల్లు పెడుతూ సదరు అధికారి సాగిస్తున్న 'వసూళ్ల పర్వం' స్థానికంగా చర్చంశనీయంగా మారింది. పన్నుల ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీపై ప్రజలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

**బెదిరింపులు.. బేరసారాలు!**

సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని పన్నుల వేట సాగిస్తున్నారు. ముందుగా కొండంత పన్ను వేసి భయభ్రాంతులకు గురిచేయడం.. ఆపై "తగ్గిస్తాం రండి" అంటూ చీకటి బేరసారాలకు తెరలేపడం ఇక్కడ నిత్యకృత్యమైంది. పన్ను సవరణ పేరుతో భారీగా ముడుపులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడిగినంత ఇచ్చుకోకపోతే ఫైళ్లను తొక్కిపెడుతూ మానసిక వేదనకు గురిచేస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ ఖజానాకు గండి.. జేబుల్లోకి ముడుపులు!**

ఈ అవినీతి కేవలం వసూళ్లతోనే ఆగడం లేదు. భారీ వాణిజ్య సముదాయాలను నివాస భవనాలుగా రికార్డుల్లో మార్చేసి, ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి కొడుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. కమర్షియల్ బిల్డింగులను రెసిడెన్షియల్‌గా చూపడం వెనుక భారీ స్థాయిలో చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగమేనని స్థానికులు మండిపడుతున్నారు.

**అధికారుల మౌనం.. అండ ఎవరిది?**

ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక మర్మమేంటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఆ బిల్ కలెక్టర్ వెనుక ఏ 'అదృశ్య శక్తి' ఉందో తేలాలని డిమాండ్ చేస్తున్నారు. అడ్డగుట్టలో పన్ను రికార్డులపై సమగ్ర ఆడిట్ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది.

**పన్నుల పేరుతో పీల్చుకుతింటున్నారు**

పారదర్శకత లేని ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి" అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సదరు బిల్ కలెక్టర్ బాగోతంపై వెంటనే ఏసీబీ విచారణ చేపట్టాలని, అక్రమ ఆస్తులపై ఆరా తీయాలని అడ్డగుట్ట వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ బృందం

ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపురం (వనపర్తి జిల్లా): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను, బీసీ పాఠశాలను విద్యాశాఖ అధికారులు సందర్శించి పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థనా సమయానికే పాఠశాలకు చేరుకున్న తనిఖీ బృందం ప్రార్థనలో పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యాన్ని పరిశీలించారు. తరగతుల వారీగా ప్రారంభ పరీక్ష మొదలుకొని నిర్మాణాత్మక మూల్యాంకనం 3 వరకు అన్ని పరీక్షల ప్రశ్నాపత్రాలు, మార్కులు, సీసీఈ రిజిస్టర్లు, ఆన్లైన్ లో నమోదు చేసిన మార్కులను, ప్రశ్నాపత్రాల్లో ఉన్న మార్కులను సరిపోల్చి చేశారు. ప్రతి తరగతిని సందర్శించి పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్కులు, నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. తరగతి వారీగా, విషయాల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న కిచెన్ గార్డెన్, ప్రీ ప్రైమరీ ఔట్ డోర్ సామాగ్రి, బోధనోభ్యాసన పరికరాలు, గ్రంథాలయ పుస్తకాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఇద్దరు ఉపాధ్యాయుల ఆదర్శ బోధనను పరిశీలించి నమోదు చేసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ బృందం పాఠశాల అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు చేయడం జరిగింది. పాఠశాలకు సంబంధించి అన్ని అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన బృందం పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాలు బాగున్నాయని, చదువులో వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రిజిస్టర్లు, రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం నోడల్ అధికారిణి ప్రేమలత, సభ్యులు జితేందర్, నరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మోహన్ రాజు, ఉపాధ్యాయులు వసంతపురం రాజు, దామోదర్ బాబు, బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయురాలు తస్లీం బేగం, ప్రీ ప్రైమరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పీఎం శ్రీ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

* **కేంద్ర బయో టెక్నాలజీ శాఖ జాయింట్ సెక్రటరీ ఏక్తా విష్ణోయి**
* **ఎఫ్రీ చైల్డ్ రీడ్స్, ఎఫ్ఆర్ఎస్ అమలు పట్ల అధికారులకు ప్రత్యేక అభినందనలు**

ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : తమ పిల్లలను ఎటువంటి పాఠశాలలకు పంపాలనుకుంటామో ఆ స్థాయిలో పీఎం శ్రీ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చి దిద్దాలని కేంద్ర బయో టెక్నాలజీ శాఖ జాయింట్ సెక్రటరీ ఏక్తా విష్ణోయి అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కేంద్ర బయో టెక్నాలజీ శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎం శ్రీ పాఠశాలలపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు సంతోషంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలనే ఉద్దేశ్యంతో పిఎం శ్రీ పాఠశాలల కాన్సెప్ట్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. పిల్లలలో పఠన సామర్థ్యాలు పెంచేందుకు ఖమ్మం జిల్లాలో చేపట్టిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అద్భుతంగా ఉందని, ఎఫ్.ఆర్.ఎస్. అమలులో కూడా మంచి పని తీరు చూపించారని అధికారులను జాయింట్ సెక్రటరీ అభినందించారు. జిల్లాలో ఎంపిక చేసిన పీఎం శ్రీ పాఠశాలల్లో 2 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, దీని పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ సెక్రటరీ కోరారు. ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం పీఎం శ్రీ పాఠశాల కాన్సెప్ట్ తీసుకొని వచ్చిందని, ఈ అంశాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 28 పీఎం శ్రీ పాఠశాలలను ప్రైవేట్ కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలలో గర్ల్ చైల్డ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని, తల్లిదండ్రుల ఫీడ్ బ్యాక్ స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు ఇంప్రూవ్ చేసుకుంటున్నామని అన్నారు. పీఎం శ్రీ నిధులతో పిల్లలను ఇండస్ట్రియల్ టూర్ తీసుకొని వెళ్లడం ద్వారా క్షేత్ర స్థాయి పరిస్థితులను గమనించి పిల్లలు వేగంగా పరిజ్ఞానం పెంచుకుంటున్నారని కలెక్టర్ అన్నారు. పీఎం శ్రీ క్రింద జిల్లాకు కేటాయించిన కోటి 15 లక్షల నిధులలో ఇప్పటి వరకు కోటి 7 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. పీఎం శ్రీ పాఠశాలల హెడ్ మాస్టర్ తమకు కేటాయించిన బడ్జెట్ ను పూర్తి స్థాయిలో వినియోగించి ఎప్పటికప్పుడు యూ.సి. సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బడి బాట కార్యక్రమం ఆధారంగా దాదాపు 3 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని, పీఎం శ్రీ పాఠశాలలో స్కౌట్, గైడ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని, ప్రతి పాఠశాలకు క్రీడా సామాగ్రి అందించి స్పోర్ట్స్ మీట్ నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం అమలు ద్వారా పిల్లలకు వివిధ సంస్కృతి అవగాహన కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలలో గత ఏడాది జరిగిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో 95 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని అన్నారు. పాఠశాలలో నెలకు ఒక శనివారం బ్యాగ్ లెస్ డే నిర్వహిస్తూ ఆ రోజు వివిధ సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలతో పిల్లల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ విద్యా శాఖ ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి, డిఈఓ చైతన్య జైనీ, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, పిఎంశ్రీ పాఠశాలల ప్రిన్సిపాల్, హెడ్ మాస్టర్ లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సామ్రాజ్య చక్రవర్తి..
# అజేయ వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్

* **ముస్తాబాద్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: హిందూ సామ్రాజ్య చక్రవర్తి.. అజేయ వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని బిజెపి, బజరంగ్‌దళ్ నాయకులు అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హిందూ ధర్మ రక్షణ కోసం, స్వరాజ్య స్థాపన కోసం పోరాడిన ఆ మహావీరుని స్మరిస్తూ బిజెపి, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల గుండా యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చేతిలో కాషాయ జెండాలు పట్టి, "జై శివాజీ.. జై భవానీ" అంటూ చేసిన నినాదాలతో ముస్తాబాద్ వీధులన్నీ మారుమోగిపోయాయి.అనంతరం ముఖ్య కూడలి వద్ద ఉన్న శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి, సామాన్యులను సైనికులుగా తీర్చిదిద్దిన శివాజీ మహారాజ్ గొప్పతనాన్ని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, ధర్మనిరతి నేటి యువతకు దిక్సూచి అని, శివాజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ గుండెల్లో నింపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బజరంగ్ దళ్ కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో శివాజీ అభిమానులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# మరాఠాల స్వరాజ్యం కోసం పోరాడి ప్రాణాలు సైతం అర్పించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ

* **యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మరాఠాల స్వరాజ్యం కోసం పోరాడి ప్రాణాలు సైతం అర్పించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ అన్నారు. మరాఠా చక్రవర్తి, ధర్మ స్థాపన కోసం సామ్రాజ్యం స్థాపించిన యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ , ఎల్లమ్మబండ లో కేబుల్ సాయి, లడ్డు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పట్వారి శశిధర్ ముఖ్యఅతిధులుగా హాజరై శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, లింగం, పోశెట్టిగౌడ్, దాతి రమేష్, నిరంజన్, సూరిబాబు, రాజు గౌడ్, రమేష్, ఖాజా, కిషన్, శ్రావణ్, మల్లేష్, నాగేష్, నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగానిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ లో విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా, స్తంభాలకు, వాహనాలకు ధ్వజాలు కట్టి, శివాజీ చిత్రపటానికి పూలమాలలతో జోహారులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎంఆర్ఎస్ రాజు పాల్గొని నివాళులు అర్పించారు అనంతరం హైందవ సామ్రాజ్య నిర్మాణం కోసం, సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం వారు చేసిన అసమాన పోరాటాలను కనబరిచిన ధైర్య సాహసాలను స్మరించుకున్నారు.

# రెండు పోలీస్ జాగిలాలకు ఎస్పీ రోహిత్ రాజు అభినందనలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎనిమిది నెలల పాటు ఐఐటీఏ, మొయినాబాద్లో బేసిక్ శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించబడిన పోలీస్ జాగిలాలు 'షైనీ', 'లైకా'లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం తన కార్యాలయంలో అభినందించారు.ప్రేలుడు పదార్థాలను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన ఈ జాగిలాలు జిల్లా పోలీస్ శాఖలో సేవలందించేందుకు రావడం సంతోషకరమని తెలిపారు. షైనీకి హ్యాండ్లర్‌గా ఏఆర్ కానిస్టేబుల్ లాల్ సింగ్, లైకాకు హ్యాండ్లర్‌గా కే. ముత్తయ్య వ్యవహరిస్తున్నారు. వారికి, డాగ్ స్క్వాడ్ సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు.ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న 12 జాగిలాల వివరాలను తెలుసుకుని, జాగిలాల సంరక్షణ, వసతి సౌకర్యాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఎంటిఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

* **మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



శంకర్‌పల్లి , ప్రజాస్ఫూర్తి : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు నుంచి పోటీ చేసి ఓడిపోయిన లావణ్య మహేష్ ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ఐదవ వార్డు కౌన్సిలర్ భానూరు కృష్ణ, మండల, మున్సిపల్ నాయకులు ఉన్నారు.

## శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి..

*** సర్పంచ్ సునీత మహిపాల్**



అందోలు, ప్రజాస్ఫూర్తి :వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే వీరుడు ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ సునీత మహిపాల్ అన్నారు. గురువారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో శివాజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మరాఠా సామ్రాజ్య స్థాపనకు కృషిచేసిన యోధుడు చత్రపతి శివాజీ నీ ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 17ఏళ్ల వయసులో శివాజీ మొదటి సారి యుద్ధం చేసి బీజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, వార్డు సభ్యులు మహిపాల్, వని మోహన్, మొరబోయిన కృష్ణ, పంతులు ఈశ్వర్, జోగాల గోవర్ధన్, కాడెం శ్రీనివాస్, గజేందర్ రెడ్డి, దేవునూరి మాణిక్యం, కల్వమీది రమేష్, బేగరి దుర్గయ్య, తాళ్ల మణికంఠ,వని దుర్గేష్, వని మచ్చేందర్, రామన్నగారి చెంద్రయ్య,మొరబోయిన మహేష్, పెంద నవీన్, చాకలి పాపయ్య, దేవునూరి ప్రభు, తలారి యాదయ్య, పుట్ల రమేష్, చెక్రాల సత్యం,గొల్ల అభిలాష్, రామన్నగారి వెంకటేశం, బుసనెల్లి రమేష్, వని మోహన్, కలపల్లి కళ్యాణ్ దాసు, రామన్నగారి శేఖర్, శ్రీహరి, కూనపులి ప్రసాద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారుల విజయాలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం :హైదరాబాద్లోని గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, దోమలగూడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగ క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు 11 పతకాలు సాధించి ప్రతిభ చాటారు. మొత్తం 16 మంది పాల్గొనగా 4 ప్రథమ, 4 ద్వితీయ, 3 తృతీయ స్థానాలు దక్కించుకున్నారు.విజేతలను ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అభినందించి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. శారీరక పరిమితులను అధిగమించి సాధించిన విజయాలు సమాజానికి స్ఫూర్తి అని పేర్కొన్నారు. క్రీడలు ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.భద్రాచలం జైష్ణవి (డిస్కస్-1వ), చాతుర్య (2వ); దమ్మపేట హర్షవర్ధన్ (50 మీ.-1వ); కొత్తగూడెం ఆసిఫ్ (షాట్‌పుట్-1వ), చరణ్ (డిస్కస్-2వ); లక్ష్మీదేవిపల్లి అనురాధ (లాంగ్ జంప్-2వ, మ్యూజికల్ చైర్-1వ); చుంచుపల్లి సాయిచరణ్ (3వ); మణుగూరు భవాని (2వ), అనిత (3వ) విజయాలు సాధించారు.కార్యక్రమంలో డీఈవో బి. నాగలక్ష్మి, ఇతర అధికారులు, శిక్షకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నవపేట్ మండలంలో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



నవబ్పేట, ప్రజాస్ఫూర్తి : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నవపేట్ మండలంలో అన్నిగ్రామాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువత శివాజీ ర్యాలీలో పార్టీలకు అతీతంగా ర్యాలీని విజయవంతం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు మండల పరిధిలోని పలు గ్రామాల సర్పంచులు యువత అందరూ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు. భారీగా ఊరేగింపులు నిర్వహించారు పలువురు పెద్దలు మాట్లాడుతూ శివాజీ ఒక పార్టీకి సంబంధం లేదని శివాజీ ఒక శక్తి అందరూ ఆయన బాటలో నడవాలని యువతను ఉద్దేశించి మాట్లాడారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రేణుకా చౌదరి రూ.10 లక్షల విరాళం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రేణుకా చౌదరి రూ.10 లక్షల విరాళం అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి సహాయం కోరగా ఆమె వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయడం పట్ల గ్రంథాలయ వర్గాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధి పట్ల ఉన్న ఆసక్తితో, విద్యార్థులు-నిరుద్యోగ యువత అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సహాయం అందించారని పేర్కొన్నారు. ప్రహరీ గోడ నిర్మాణంతో గ్రంథాలయానికి భద్రత పెరిగి పాఠకులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.కార్యదర్శి కే. కరుణ కుమారి హర్షం వ్యక్తం చేస్తూ రేణుకా చౌదరి ఉదారతకు కొత్తగూడెం ప్రజలు, పాఠకులు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం. నవీన్ కుమార్, గ్రంథపాలకురాలు జీ. మణి మృదుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# బత్తాయి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

*** రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాష**





నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బత్తాయి సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాష అన్నారు. బత్తాయి రైతుల తో రైతు ఉత్పాదక సంస్థ ఏర్పాటు ద్వారా వారికి లాభం చేకూర్చేందుకు ఉద్దేశించి గురువారం కొండమల్లేపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రంలో బత్తాయి రైతులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పాల్గొనే నిమిత్తం జిల్లాకు వచ్చిన ఆమె గుర్రంపోడు మండలం,బ్రాహ్మణగూడెం లో బత్తాయి రైతు శ్రీనివాస యాదవ్ జీవ ఎరువులను వినియోగించి అధిక దిగుబడులను సాధిస్తున్నారని తెలుసుకొని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ తో కలిసి రైతు శ్రీనివాస యాదవ్ బత్తాయి తోటను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ,నల్గొండ జిల్లా బత్తాయి సాగుకు ప్రసిద్ధి అని, అయితే వివిధ కారణాల వల్ల ఇటీవల కాలంలో జిల్లాలో బత్తాయి సాగు పూర్తిగా తగ్గిపోయిందని, రైతులు పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించేందుకు, అలాగే నాబార్డు సహకారంతో రైతు ఉత్పాదక సంస్థల ను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేసేందుకు , అధిక లాభాలు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బత్తాయిలో జీవ ఎరువులు వాడడం వల్ల లాభాలు పెరిగే అవకాశం ఉందని శ్రీనివాస్ యాదవ్ బత్తాయి క్షేత్రాన్ని పరిశీలించిన తర్వాత అర్థమైందని, అందువల్ల రైతులు బత్తాయి సాగులో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.కాగా రైతు శ్రీనివాస యాదవ్ తన 8 ఎకరాల పొలంలో జీవ ఎరువులను ఉపయోగించి బత్తాయి సాగు చేస్తు లాభాలు ఆర్జిస్తున్నారు.ఈ సందర్భంగా వర్మి కంపోస్టు, జీవ ఎరువులు, పురుగులను నియంత్రించే మందులను వీరు పరిశీలించారు. ప్రొఫెసర్ ఆరిఫ్ ఖాన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిని, ఉద్యాన అధికారి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన రైతులు ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ లకు బత్తాయి ,జామ, వాటర్ ఆపిల్ వంటి ఉద్యాన ఫలాలను బహూకరించారు.




# లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధం

*** డిఎంహెచ్ ఓ పుట్ల శ్రీనివాస్**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం పూర్తిగా చట్ట విరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు విధించబడతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం పీసీఅండ్ పి అండ్ డి న్ డి టీ చట్టం-1994 మరియు నియమాలు-1996 అమలు జిల్లా సలహా కమిటీ సమావేశం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిగారి ఛాంబరులో నిర్వహించారు.నల్గొండ జిల్లాలో ఆడపిల్లల జననాల సంఖ్య తగ్గుదల వలన లింగ నిర్ధారణ, లింగ వివక్షను అరికట్టే చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తామని చెప్పారు. జిల్లాలో అల్ట్రాసౌండ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు పి సి పి ఎన్ డి టి చట్ట నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, అవసరమైన రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎటువంటి లోపాలు గుర్తించినా సదరు కేంద్రాలను , సస్పెండ్ లేదా రద్దు వంటి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో కొత్తగా దరఖాస్తు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల ఫైళ్లను సమీక్షించి, చట్టబద్ధ అర్హతలు ఉన్న కేంద్రాలకు మాత్రమే ఆమోదం ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. అలాగే గడువు ముగిసిన కేంద్రాల పునరుద్ధరణ దరఖాస్తులను కూడా సమగ్రంగా పరిశీలించి, నిబంధనలు పాటించిన వాటికే అనుమతులు ఇవ్వాలని సూచించారుగర్భ నిరోధక మాత్రలు డాక్టర్ ప్రిపెషన్ లేకుండా మెడికల్ షాప్ లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . చట్టపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.ఆడపిల్లల సంరక్షణలో సమాజం భాగస్వామ్యం కావాలనిఆడపిల్లల జననాల సంఖ్య తగ్గడం ఆందోళనకరమని, దీనిపై సమాజంలో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.ఆడపిల్లే కుటుంబానికి ఆనందం సమాజానికి భవిష్యత్ అనే సందేశంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో లింగ సమానత్వం, మహిళా సాధికారతకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పిలుపునిచ్చారు. సమావేశం లో సభ్యులు పలు సూచనలు అందిస్తు జిల్లాలో చట్టం అమలును మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు.ఈ సమావేశానికి జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ గైకనాలజిస్ట్ కట్టాజ్యోతి, నల్గొండ వైద్య నిపుణులు డాక్టర్ సుచరిత, గైనకాలజీస్ట్ దీప, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కృష్ణకుమారి, ఎన్జీవో గీత హాజరయ్యారు.

# సామాన్యుడు చేస్తే అక్రమం... ఒక వర్గానికి మాత్రమే సక్రమం

- **ప్రశాంత్ నగర్ లో అక్రమ నిర్మాణాల జోరు.....**
- **చోద్యం చూస్తున్న రెవిన్యూ సిబ్బంది.....**
- **కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోని రెవెన్యూ అధికారులు.....**



శేర్లింగంపల్లి : ప్రజాస్ఫూర్తి: మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ 100 సర్వే నెంబర్లు పుట్టగొడుగుల్లా అక్రమ రూములు , షెడ్లు వెలుస్తున్నాయి. శని ఆదివారాల్లో రెవెన్యూ అధికారులు లేని సమయంలో ఈ ఆక్రమాలకు పాల్పడుతున్నారు. శనివారం మెటీరియల్ రెడీ చేసుకుని రాత్రికి రాత్రి పూర్తిచేసి



సోమవారం ఓపెనింగ్ చేసుకుంటారు. ఒక్కసారి అక్రమం మని కూల్చిన షెడ్లు కొద్దిరోజుల తర్వాత ఎలా సక్రమవుతాయో చెప్పాలంటూ స్థానికులు నిలదీస్తున్నారు.. ఇప్పటికే పదుల సంఖ్యలో అక్రమ షెడ్లు వెలిశాయి. ఇక్కడ నిర్మాణాలు షెడ్యూల్ ఒక వర్గం వారికి మాత్రమే అనుమతి ఉందా అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న డోంట్ కేర్ అంటు రెవెన్యూ సిబ్బంది దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులు అరకొర షెడ్యూల్ను కూల్చివేసి చేతులు దులుపుకుంటున్నారు రెవిన్యూ సిబ్బంది. మరోవైపు కొంతమందిని వదిలేసి కొంతమంది షెడ్లు మాత్రమే కూల్చడంతో రెవెన్యూ సిబ్బందిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంత్ నగర్ లో ఒక్కొక్కరికి ఒక్కొక్క న్యాయం ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఒక నిర్మాణం 15 రోజుల నుంచి నెల రోజులు నిర్మిస్తున్న రెవెన్యూ సిబ్బందికి కనపడదని సామాన్యుడు కనీసం బేస్ మెంట్ వేసిన రెవిన్యూ సిబ్బంది ఆగం మేఘాల పైన వాలిపోతారని స్థానికుల వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టిపెట్టాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు

# మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తా

**18 వ వార్డులో నీటి బోరు ఏర్పాటు**

**- ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఇ.ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 18వ వార్డులో ప్రజల త్రాగునీటి కష్టాలను తీర్చేందుకు సొంత ఖర్చుతో గురువారం కొత్త బోరు బావిని వేయించారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ గెలుపు కోసం సహకరించిన భాస్కర్ ఆ సమయంలోనే ఒక హామీ ఇచ్చారు. నువ్వు గెలిచి వస్తే వార్డు అభివృద్ధికి నా వంతు తోడ్పాటు అందిస్తాను, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అందులో భాగంగానే, వార్డులో నెలకొన్న తీవ్రమైన నీటి ఎద్దడిని కౌన్సిలర్ సురేష్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించి బోరు వేయించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు త్వరలోనే వార్డులో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీలోని ఏ వార్డులో సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి 100పడకల విస్తరణను ప్రభుత్వం, మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ వహించి, వచ్చే మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని కోరారు. మెరుగైన వైద్యం అందక సామాన్య ప్రజలు హైదరాబాద్ వంటి నగరాలకు పరుగులు తీయాల్సి వస్తోందని, వర్షాకాలం లోపే ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే స్థానికులకు పెద్ద ఊరట లభిస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అనే మూడు అంశాలు ప్రతి పేదవాడికి అందాలన్నదే ఇ.ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ప్రధాన సంకల్పమన్నారు. కౌన్సిలర్ బుడ్డ సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజల కోసం ఇ ఎల్ వి భాస్కర్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, సొంత నిధులతో వార్డు సమస్యలను పరిష్కరిస్తున్న భాస్కర్ కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వార్డులో ఏర్పాటు చేసిన కౌన్సిలర్ ఆఫీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ బస్తీలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



ప్రజా స్ఫూర్తి: భద్రాద్రి కొత్తగూడెం: గురువారం తెలంగాణ యోగ టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో 50వ డివిజన్ నెహ్రూ బస్తీలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పట్టణ ప్రముఖ యోగ గురువు గుమలాపురం సత్యనారాయణ నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఫిజియోథెరపీ వైద్యుడు డా. జె. వెంకన్న పాల్గొని శివాజీ మహారాజ్ జీవితం, హిందూ సామ్రాజ్య స్థాపన కోసం చేసిన పోరాటాల విశేషాలను వివరించారు. గుమలాపురం సత్యనారాయణ కూడా శివాజీ ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత పోషకాహార భోజన పొట్లాలను పంపిణీ చేశారు. అలాగే జయంతి పురస్కరించుకుని వృద్ధ మహిళలకు కొత్త చీరలు అందజేశారు. కార్యక్రమంలో వి. రామారావు, అత్తులూరి రాము, వినోద, విజయ్ కుమారి, మల్లేశ్వరి, పిట్టల చంద్రశేఖర్, మిట్టపల్లి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియన్ ఫౌండేషన్ ఘనంగా 10వ వార్షికోత్సవం వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండేషన్ స్థాపించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ 2016లో స్థాపించిన ఈ ఫౌండేషన్ రాష్ట్రాల వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత సామాజిక సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.బి. బాలు మాట్లాడుతూ ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయానికి అసలు క్రెడిట్ రక్తదాతలదేనని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే వారు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సలహాదారులు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి సతీష్, సభ్యులు కమలాకర్, రాజేష్, జుబ్బు, రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా డెంటల్ పరీక్షలు చేయడం చాలా సంతోషకరం

*** జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులకు ఉచితంగా డెంటల్ పరీక్షలు చేయడం చాలా సంతోషకరమని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ గవర్నమెంట్ స్కూల్లోలో హరే కృష్ణా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి కొలుకుల జగన్ పాల్గొని వైద్యులు ఉచితంగా నిర్వహించిన డెంటల్ పరీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నమెంట్ స్కూల్లో పిల్లలకు అలాగే విద్యార్థులకు పంటి రక్షణకు అవగాహన చేసిన డాక్టర్ హరి కి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో.. స్కూల్ హెచ్ఎం . కిషన్ నాయక్ , .హరే కృష్ణ హాస్పిటల్ డాక్టర్స్. హరి డాక్టర్ గణేష్ . అనూష మౌనిక పూజిత మనోజ్ డాక్టర్ రాహుల్ నాయకులు భాను ప్రకాష్. సంతోష్ ప్రవీణ్ ఖయ్యూం సంపత్ రెడ్డి సునీల్ రెడ్డి చంద్రకళ శైలజ తదితరులు పాల్గొన్నారు,

## ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు నేటి యువతకు మార్గదర్శకం

* కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, దేశభక్తి, సుశాసన విధానం నేటి యువతకు మార్గదర్శకమని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్ అన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ లో విఠల్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం జగద్గిరిగుట్ట డివిజన్ బిజెపి కార్యాలయంలో లాస్ట్ బస్టాప్ లో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఆనాటి మొగల్ చక్రవర్తి ఔరంగాజేబు ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టిన వారిని ఎదుర్కొని మహా రాష్ట్ర ప్రజలను హిందూ ధర్మాన్ని కాపాడిన గొప్ప నాయకుడు వారి యొక్క భక్తికి మెచ్చి భవాని మాత ఖడ్గాని ప్రసాదించింది అన్నారు ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి, వసుంధర రాజేందర్ రెడ్డి జగన్ ముదిరాజు ముత్యాలు మురళి గౌడ్ సత్యనారాయణ యాదవ్ రమేష్ యాదవ్ నరసింహ ప్రభాకర్ రెడ్డి శ్రీహరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## ఇంజినీరింగ్ కాలేజీలు వసూలు చేస్తున్న అదనపు ఫీజులపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన కు ఎన్ఎస్యుఐ ఫిర్యాదు

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఇంజినీరింగ్ కాలేజీలు వసూలు చేస్తున్న అదనపు ఫీజులపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకుడు దేవరాల రాకేష్ యాదవ్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని కాలేజీలు ప్రభుత్వ ఫీజు నిర్మాణాన్ని ఉల్లంఘిస్తూ విద్యార్థుల నుంచి లక్షల రూపాయల అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సంబంధిత ఇంజినీరింగ్ కాలేజీలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం, రెవెన్యూ శాఖ పరిశీలన చేపట్టి, ఫీజుల సమస్యను పరిష్కరించేందుకు జేఎన్టీయూ హెచ్ వైస్ చాన్సలర్ , తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని నివేదికలు కలెక్టర్ ఆఫీస్‌కు సమర్పించాల్సి ఉంది, తద్వారా విద్యార్థుల సమస్యలకు తక్షణమే పరిష్కారం కనుగొనబడుతుందన్నారు. వందల మంది విద్యార్థుల భవిష్యత్తు రక్షణ మా ప్రధాన లక్ష్యం. ఫీజులు మోసం చేసే కాలేజీలపై తక్షణమే చర్యలు తీసుకోవడం అత్యవసరం. విద్యార్థుల హక్కులను భంగం చేయకుండా, అన్ని కాలేజీలు ప్రభుత్వ నియమాలను గౌరవించాలన్నారు.

## ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు – డ్రగ్స్ అరికట్టుకు కట్టుదిట్ట చర్యలు

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ రూపొందించి కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీలో బ్లాక్ స్పాట్లపై సమీక్షించారు.జిల్లాలో 38 బ్లాక్ స్పాట్లు, 62 ప్రమాదావకాశ ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జాతీయ రహదారి 30లో చంద్రుగొండ మండలం తిప్పనపల్లి యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శ్రీ ఇంక్లెన్, అశ్వరావుపేట, నారావారిగూడెం, ఇల్లందు డిగ్రీ కళాశాల సమీపం, సుజాతనగర్, చుంచుపల్లి, అశ్వాపురం, మణుగూరు, దుమ్ముగూడెం ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఫిబ్రవరిలో 24 ప్రమాదాలు నమోదైన నేపథ్యంలో కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మణుగూరు, ఇల్లందు, అశ్వరావుపేట, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాల్లో ఆటోమేటిక్ సిగ్నల్స్, జీబ్రా లైన్స్, సూచికల ఏర్పాటుపై నివేదికలు కోరారు. ప్రమాదాల వివరాలను సమన్వయంతో సేకరించి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.అత్యవసర వైద్య సేవలు బలోపేతం చేయాలని, అశ్వరావుపేటలో అంబులెన్స్ ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దమ్మపేట, అల్లపల్లి, అన్నపురెడ్డిపల్లి రహదారులపై బోలార్డులు ఏర్పాటు, పిచ్చిమొక్కల తొలగింపు, వర్షాకాలానికి ముందు రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌సీసీ విద్యార్థులతో రహదారి భద్రత అవగాహన ర్యాలీలు, పాఠశాలల్లో ఓవర్ స్పీడ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్య నియంత్రణ కమిటీలో డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో ఆధునిక పరికరాలతో తనిఖీలు, డిఅడిక్షన్ సెంటర్ల ఏర్పాటుపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. తొలి దశలో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు.గ్రామాల్లో గుడుంబా తయారీ, వినియోగంపై కఠిన తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తక్షణమే న్యాయవాద రక్షణ చట్టం బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలి

* **బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కట్టా అనంతరెడ్డి,మంద నాగేష్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: నల్లగొండ జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న అత్యంత దారుణ ఘటన న్యాయ వృత్తి గౌరవాన్ని, న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని తీవ్రంగా కలిసి వేసిందని నల్లగొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కట్టా అనంతరెడ్డి, మంద నగేష్ అన్నారు.న్యాయవాది జి.నరేష్ నివాసంపై కొంతమంది దుండగులు దాడి చేసి ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా హత్యాయత్నానికి కూడా వెనుకాడకపోవడం అమానుషమైన చర్య అన్నారు. నరేష్ గారి భార్యపై, చిన్న కూతురిపై విచక్షణారహితంగా దాడి చేయడం మనసును కలచివేసే ఘటన అన్నారు.ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదని న్యాయవృత్తి పట్ల ఉన్న ద్వేష భావనకు, న్యాయ పరిరక్షణ వ్యవస్థపై ఉన్న సవాల్‌కు స్పష్టమైన నిదర్శనం అన్నారు.ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిన్న రాత్రి నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది న్యాయవాదులు వెళ్లి ఎస్ఐ గారికి ఫిర్యాదు చేశారు. దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గురువారం నల్లగొండ జిల్లా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి, జిల్లా కోర్టు సముదాయం నుండి క్లాక్ టవర్ సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. న్యాయవాదుల ఐక్యత, ఆవేదన, ఆగ్రహం నిరసన ద్వారా వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, కార్యదర్శి మంద నగేష్ మాట్లాడుతూ గత ఐదారు సంవత్సరాలుగా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని నిరంతరం పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒకచోట న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి, న్యాయపాలనకు ముప్పు అన్నారు.ఇటీవల చేవెళ్లలో మహిళా న్యాయవాదిని హత్య చేయడం, హైదరాబాద్‌లో మరో న్యాయవాదిపై హత్య ఘటన, ఇప్పుడు నల్లగొండలో జరిగిన దాడి ఇవన్నీ కలిసి న్యాయవాదుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నారు. న్యాయవాదులపై దాడి అంటే న్యాయవ్యవస్థపై దాడి చేసినట్టే. న్యాయవాదులు భయాందోళనల మధ్య వృత్తి నిర్వహించాల్సి వస్తే, సామాన్య ప్రజలకు న్యాయం ఎలాఅందుతుందన్నారు. కాబట్టి, తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల హక్కుల రక్షణకు సంబంధించిన చట్టంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయసభలలో “న్యాయవాదుల రక్షణ చట్టం” బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు.న్యాయవాదుల భద్రత, గౌరవం కాపాడకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదుల ఐక్య పోరాటం ఆగదని న్యాయం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం మా ఉద్యమం కొనసాగుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ , జూనియర్ న్యాయవాదులు జి వెంకటేశ్వర్లు, ఎస్ ఆర్ ఠాగూర్, జె.భాస్కర్ రెడ్డి ఎం నాగిరెడ్డి, టి.కిషోర్ కుమార్, పి.శేఖర్, జనిగల రాములు, జి . ఎన్.ఎస్ ప్రసాద్, అన్నపూసల ఐలయ్య,బి అశోక్ కుమార్, మేక యాదగిరి రెడ్డి, ఎం.ప్రమీల,ఎన్.భాగ్యమ్మ,టి వరుణ శ్రీ,ఎ.వెంకట్ రెడ్డి, కొండ శ్రీనివాస్, బి మధు, ముక్కెర శ్రీనివాస్, కామేష్, ఎంవి రమేష్, సల్లా నరేష్ బి.సైదులు, బి.స్వామినాథ్,కొలగాని నిఖిల్ యాదవ్, ఆవుల ప్రేమ్ సుందర్,పందుల సైదులు, సయ్యద్ అఫ్రోజ్,జోగు నగేష్ , కుర్ర యాదగిరి,కే శంకరయ్య, అర్జున్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్.... ఆరోగ్యం రీసెట్‌కు అద్భుత అవకాశం!

**ముస్లింల పవిత్ర మాసం రంజాన్ వచ్చేసింది. రోజంతా పచ్చినీళ్లు కూడా ముట్టకుండా నెల రోజులపాటు ఉపవాసం! మన జీర్ణ వ్యవస్థకు సుదీర్ఘమైన విశ్రాంతినిచ్చి...పునరుజ్జీవం కల్పించేందుకు అద్భుత అవకాశమిది. కానీ...ముస్లిం సోదరులు ఉపవాస దీక్షకు ముందు.. ఇలా ఆహారం తీసుకుంటే గొప్ప ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. మరి అవేంటో తెలుసుకుందామా..!.**



సమోసాలు, పకోడి, లస్సీ, చక్కెర దట్టించిన మసాలా టీ, బిర్యానీ, రోటీ, పరాటా.. హలీమ్ వంటివి రంజాన్ సమయంలో బాగా పాప్యులర్ అవుతుంటాయి. పండ్లు, ఖర్జూరాలు తినేవాళ్లు ఉంటారు కానీ చాలామంది బిర్యానీల వంటివాటికి అదనంగా వీటిని స్వీకరిస్తుంటారు. ఫలితంగా రోజంతా ఉండే ఉపవాసంతో వచ్చే ఆరోగ్య ప్రయోజనాలు కాస్తా దెబ్బతింటాయని అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఏడాది మొత్తమ్మీద పేరుకుపోయిన మలినాలను శరీరం పగలు మొత్తం శుభ్రం చేసుకుంటే... రాత్రికాగానే మళ్లీ అవే అనారోగ్య కారకాలను లోపలికి పంపిస్తున్నామన్నమాట. వీటన్నింటినీ జీర్ణం చేసేందుకు కాలేయం కాస్తా కష్టపడాలి. ఫలితంగా నిద్ర చెడిపోతుంది. నెలరోజులపాటు సాగే ఈ తంతు కారణంగా మలినాలను మొత్తం వదిలించుకునే బదులు కాలేయం మరింత ఎక్కువ శ్రమ పడుతుంది. రక్తంలో చక్కెర మోతాదులు తరచూ మారిపోతుండటం వల్ల నాడీ వ్యవస్థ ఒత్తిడికి గురవుతుంది. ఉపవాసం పుణ్యమా అని పొట్ట తేలిక అయ్యే బదులు వేయించిన తిండి, చక్కెరలతో నిండిపోతుంటుంది.

### ఇలా చేస్తే మేలు... ఇఫ్తార్...

ఖర్జూరం, నీళ్లతో మీ దీక్ష విరమణ చేపట్టండి. శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు ఖర్జూరాల్లో మెండు. డీహైడ్రైషన్ నుంచి కాపాడతాయి. వీటితోపాటు వేడి వేడి సూప్, ప్రొటీన్ కోసం కొంచెం మాంసం/చేప/కోడిగుడ్లు తీసుకోవడం మేలు. అలాగే.. ఉడికించిన కాయగూరలు, ఆరోగ్యకరమైన కొవ్వులు కొంత మోతాదులో తినడం శరీరంలో మంట/వాపులను తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అవకాడో, ఆలివ్ ఆయిల్, బాదాం. జీడిపప్పు, వాల్‌నట్స్ వంటివి లేదంటే, గుమ్మడి/సూర్యకాంతి, అవిశ గింజల వంటి వాటిల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు, ప్రొటీన్, ఫైబర్‌లు లభిస్తాయి.



### షహూర్ (తెల్లవారుఝాము)

ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులకు ప్రాధాన్యమివ్వండి. రోజంతా శక్తిని అందించేందుకు సంక్లిష్టమైన కార్బోహైడ్రేట్లు తీసుకోవడం మేలు. బ్రౌన్ రైస్, ఓట్స్, చిరుధాన్యాలు, చిలగడదుంపలు, క్యారెట్స్ మాత్రమే కాదు... ఆపిల్స్, అరటిపండ్లు, నారింజ వంటి పండ్లు మేలు. చిటికెడు ఉప్పు కలుపుకుని నీళ్లు తాగాలి. ఉప్పు ఎక్కువగా ఉన్న, బాగా శుద్ధి చేసిన ఆహారం తీసుకోవడం వల్ల దాహం ఎక్కువ అవుతుంది.

### రెండింటి మధ్య...

నిద్రకు ప్రాధాన్యమివ్వండి. రాత్రి ఎక్కువ సేపు మేలుకుని ఉండటం వల్ల శరీరంపై ఒత్తిడి పెరిగిపోయి మంట/వాపులు పెచ్చరిల్లుతాయి. ఇఫ్తార్ విందు తరువాత కాసేపు అటు ఇటు కదలడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది.

### అద్భుతమైన అవకాశం...

రంజాన్ మాసం... దైవిక సేవతోపాటు మీకు మీరు సేవ చేసుకునేందుకు ఉపయోగించుకునే అద్భుత అవకాశం. అయితే ఉపవాసం ఒక్కటే సరిపోదు. శరీర హీలింగ్‌కు అవసరమైన పరిస్థితులను కల్పిస్తుంది అంతే. ఇక్కడ ఉపవాసాన్ని మీరెలా చేస్తున్నారనే దానిపై శరీరానికి కలిగే ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి.

ముస్లిం సోదరులు ఏటా ఒక నెల రోజులపాటు పైన చెప్పుకున్న ఆహార నియమాలను పాటిస్తే.. మిగిలిన 11 నెలలూ శరీరం మెరుగ్గా పనిచేస్తుంది. ముస్లిం సోదరులు ఒక్కరే కాదు... మిగిలిన వారు కూడా అప్పుడప్పుడు కొంత కాలం పాటు ఉపవాసం చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

## మనసు దోచే మక్రామె..!

కొత్తగా ఇల్లు కట్టుకుని ఇంటీరియర్ కోసం బడ్జెట్‌లో ప్లాన్ చేసుకోవాలా? ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా పర్యావరణహితంగా ఇంటిని అలంకరించుకోవాలి అనుకుంటున్నారా? అయితే ఈ మక్రామె వాల్ ఆర్ట్‌లు మీకు నచ్చితీరతాయి. కాటన్, ఊలు, జ్యూట్, లినెన్ దారాలతో చేతితో తయారుచేసిన ఈ అలంకరణలు ఇంటికి మినమలిస్ట్ లుక్‌ని అందిస్తాయి. అంతేకాదు, ఇంటికి పాజిటివ్ వైబ్‌ని తెచ్చి మనలో ఒత్తిడినీ తగ్గిస్తాయట. అందుకే వీటిని కాన్వాస్‌లు, వాల్ హ్యాంగింగ్స్, పాట్ హ్యాంగింగ్స్, కర్టెన్లు, టేబుల్ రన్నర్స్ రూపంలో తీసుకొచ్చారు తయారీదారులు. బెడ్‌రూమ్, లివింగ్ రూమ్, పిల్లల గది, కార్నర్ డెకార్‌గానూ అలంకరించుకోవచ్చు. అంతేకాదు, కొందరికి గోడలమీద జిగేల్‌మనిపించే రంగులు నచ్చకపోవచ్చు. అలాగని డబ్బులు పెట్టి వాల్ డెకార్లు చేయించుకోలేకపోవచ్చు. అలాంటి వాళ్లు ఈ సహజ మక్రామె వాల్ ఆర్ట్‌లు అమర్చి చూడండి.



# మీకో నమస్కారం... మీడియాతో ఒక్క ముక్క మాట్లాకుండా చిరునవ్వుతో వెళ్లిపోయిన ఐబొమ్మ రవి

* సినిమాల పైరసీ కేసులో ఐబొమ్మ రవికి షరతులతో కూడిన బెయిల్
* చంచల్‌గూడ జైలు నుంచి బుధవారం సాయంత్రం విడుదల
* మీడియా ప్రశ్నలకు మౌనంగా, చిరునవ్వుతోనే సమాధానం
* పాస్‌పోర్టు స్వాధీనం చేసి, రోజూ పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని షరతు
* గతేడాది నవంబర్‌లో అరెస్ట్ కాగా, 90 రోజులుగా జైలులో ఉన్న రవి

సినిమాల పైరసీ కేసులో ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. సినిమాల పైరసీ కేసులో అరెస్టయిన 'ఐబొమ్మ' రవి చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. తెలంగాణ హైకోర్టు మంగళవారం అతడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో బుధవారం సాయంత్రం రవి జైలు నుంచి బయటకు వచ్చాడు. అయితే జైలు నుంచి బయటికి వచ్చిన సందర్భంగా మీడియా అతడిని మాట్లాడించే ప్రయత్నం చేసింది. మిమ్మల్ని పైరసీ




దొంగ అంటున్నారు... దానికి మీరేమంటారు అంటూ ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించాడు. అందుకు రవి చిరునవ్వే సమాధానంగా, రెండు చేతులు జోడించి నమస్కారం పెడుతూ ముందుకు సాగిపోయాడు. మీడియా ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అతడు ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. కారులో ఎక్కిన తర్వాత కూడా మీడియా ప్రతినిధులకు నమస్కారం పెడుతూ, చిరునవ్వే సమాధానం అన్నట్టుగా మౌనంగా ఉండిపోయాడు. గతేడాది నవంబర్‌లో ఐబొమ్మ వెబ్ సైట్ ద్వారా కొత్త సినిమాలను అక్రమంగా అప్‌లోడ్ చేస్తున్నాడన్న ఆరోపణలతో సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేశారు. అతనిపై ఐదు కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఈనాడు కథనం ప్రకారం, హైకోర్టు అతనికి పలు కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేసింది. దేశం విడిచి వెళ్లకూడదని, తన పాస్‌పోర్టును కోర్టులో స్వాధీనం చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా, ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని స్పష్టం చేసింది.

## తెలంగాణ ఇంటర్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

* ఈసారి ఇంటర్ పరీక్షలు రాయనున్న 9.9 లక్షల మంది విద్యార్థులు
* ఈరోజు ఇంటర్ హాల్ టికెట్ల విడుదల
* ఎగ్జామ్ సెంటర్లను ఈజీగా గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ ముద్రణ




ఈ నెల 25వ తేదీ నుంచి తెలంగాణలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజవుతున్నట్టు ఇంటర్ బోర్డు తెలిపింది. మరోవైపు ఇంటర్ పరీక్షల హాల్ టికెట్లను ఈరోజు విడుదల చేశారు. ఆయా కళాశాలల ఆన్ లైన్ లాగిన్లతో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి హాల్ టికెట్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. మొబైల్ ఫోన్ల ద్వారా కూడా హాల్ టికెట్లను పొందే సదుపాయాన్ని కల్పించారు. బోర్డు వద్ద విద్యార్థులు నమోదు చేసుకున్న రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా హాల్ టికెట్ డౌన్ లోడ్ లింక్ ను పంపిస్తున్నట్టు బోర్డు తెలిపింది. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉన్నట్టు గుర్తిస్తే... వెంటనే ప్రిన్సిపాళ్ల ద్వారా బోర్డు దృష్టికి తీసుకొచ్చి, తప్పులను సరిదిద్దుకోవాలని చెప్పారు. మరోవైపు ఈసారి హాల్ టికెట్లపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను ముద్రించారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా ఎగ్జామ్ సెంటర్ ఎక్కడ ఉందో సులభంగా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## రూ.13,000 కోట్ల గేమింగ్ స్కామ్ హైదరాబాద్‌లో కీలక సూత్రధారి అరెస్ట్

* హైదరాబాద్‌లో పంకజ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్న జీఎస్టీ అధికారులు
* నకిలీ కేవైసీలతో గేమింగ్ వెబ్‌సైట్లకు సహకరించినట్టు ఆరోపణలు
* పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకులను మోసం చేసినట్టు గుర్తింపు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ.13,000 కోట్ల విలువైన ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్‌లో హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఈ భారీ మోసంలో ప్రధాన సూత్రధారులలో ఒకరైన పంకజ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అడ్సమ్ అడ్వైజరీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌గా ఉన్న పంకజ్ కుమార్, ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించినట్టు అధికారులు గుర్తించారు.



చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లకు అండగా నిలుస్తూ, వాటి కార్యకలాపాలకు సహకరించడమే లక్ష్యంగా ఈ సిండికేట్ పనిచేసింది. ఇందులో భాగంగా, పంకజ్ కుమార్ నకిలీ కేవైసీ పత్రాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషించారు. డొల్ల కంపెనీలు (షెల్ ఎంటిటీలు), నకిలీ వ్యాపారుల పేరిట మోసపూరిత కేవైసీలను తయారు చేసి, వాటి ద్వారా ఆర్‌బీఐ నియంత్రణలో ఉండే పేమెంట్ గేట్‌వేలు, బ్యాంకుల నుంచి పేమెంట్ అగ్రిగేటర్ సేవలను పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నకిలీ కేవైసీల ద్వారా గేమింగ్ వెబ్‌సైట్లు తమ అక్రమ లావాదేవీలను చట్టబద్ధమైనవిగా చిత్రీకరించే ప్రయత్నం చేశాయి. ఫిన్‌టెక్ కంపెనీల సహాయంతో ఈ వ్యవస్థీకృత ముఠా భారీ ఎత్తున మోసాలకు పాల్పడినట్టు జీఎస్టీ అధికారులు తెలిపారు. ఈ కేసులో పంకజ్ కుమార్ అరెస్ట్ అత్యంత కీలకమని, దర్యాప్తును మరింత లోతుగా కొనసాగిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## హైకోర్టులో రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ

* 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు
* గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదుతో కేసులు నమోదు
* క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి



కోర్టు హాజరు నుంచి మినహాయించిన హైకోర్టు తనపై భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులు కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచార సభలలో తనపై నిరాధార, అనుచిత ఆరోపణలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేయడంతో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు నమోదయ్యాయి. భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం కోర్టులో హాజరునుంచి ముఖ్యమంత్రికి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయడానికి గండ్ర వెంకటరమణారెడ్డి న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

## కొత్త పార్టీకి ముహూర్తం ఖరారు, ఎక్కడి నుంచి పోటీ చేస్తానంటే..: కవిత కీలక ప్రకటన

* మే నెల మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీని ప్రకటిస్తానని వెల్లడి
* పార్టీ పేరులో 'తెలంగాణ' ఉంటుందని స్పష్టీకరణ
* సిద్దిపేట లేదా బోధన్ నుంచి పోటీ చేస్తానని కవిత వెల్లడి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నామని, మే నెల మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీని ప్రకటిస్తామని తెలిపారు. తమ పార్టీ పేరులో 'తెలంగాణ' ఉంటుందని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అవకాశం ఉందని అన్నారు. అయితే సిద్దిపేట మొదటి ప్రాధాన్యత అన్నారు. హైదరాబాద్‌లోని జాగృతి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రభుత్వ సంస్థగా మార్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంతో బస్సుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని, దీంతో ఉద్యోగులపై పని ఒత్తిడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే బస్ బాడీ బిల్డింగ్ యూనిట్‌ను కర్ణాటకలోని దావణగెరెకు తరలించి అన్యాయం చేశారని అన్నారు. స్వయంగా మహిళలే అసలు ఉచిత బస్సు పథకం ఎందుకు పెట్టారని ప్రశ్నిస్తున్నారని కవిత తెలిపారు. ఉచిత బస్సుల కారణంగా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. మహిళలతో పాటు వికలాంగులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు 52 రోజుల పాటు సమ్మె చేస్తే యూనియన్లను రద్దు చేశారని ఆరోపించారు. కానీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని అన్నారు. అధికారంలోకి వస్తే యూనియన్లను తిరిగి ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాటను ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల కోసం ఈ నెల 24న



తలపెట్టిన చలో సెక్రటేరియట్‌కు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు.

## తెలంగాణలో అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి పీపీపీని ప్రోత్సహిస్తున్నాం: శ్రీధర్ బాబు

* ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న శ్రీధర్ బాబు
* అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు
* పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్న మంత్రి



అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి తెలంగాణలో పీపీపీని ప్రోత్సహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఆయన పాల్గొన్నారు. అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణలకు తెలంగాణ వేదికగా ఉందని అన్నారు. పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వ స్థిరమైన విధానాల కారణంగా ఏఐ పరిశోధనలకు రాష్ట్రం వేదికగా మారింది. ప్రజాసేవల్లోనూ ఏఐ ద్వారా వేగంగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## మంత్రుల అవినీతి, వారికి చెంచాగిరి చేస్తున్న ఐఏఎస్ అధికారుల జాబితా మా వద్ద ఉంది

* అవినీతి మంత్రుల చిట్టా తమ వద్ద ఉందన్న బండి సంజయ్
* ఢిల్లీ పెద్దలకు మూటలు పంపించడానికే కాంగ్రెస్ అధికారంలో ఉందని విమర్శ
* 2029 నాటికి దేశంలో ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండదని జోస్యం

తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, ఇంకా బయటకు తీస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



అన్నారు. మంత్రులు చేస్తున్న అవినీతి ఆధారాలను సేకరిస్తున్నామని, ఈ మంత్రులకు కొందరు ఐఏఎస్ అధికారులు చెంచాగిరి చేస్తున్నారని ఆరోపించారు. మంత్రులకు చెంచాగిరి చేస్తున్న అధికారులు వాళ్లు సంపాదించుకుంటూ, మంత్రులకు ఎలా కూడబెడుతున్నారో తమకు తెలుసని అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు పంపించడానికే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉందని బండి సంజయ్ అన్నారు. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా విప్పుతామని హెచ్చరించారు. అవినీతికి సంబంధించి ఆడియో రికార్డులు తమ వద్ద ఉన్నాయని అన్నారు. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు చెంప చెల్లుమనిపించామని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి అధికార కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కయిందని ఆరోపించారు. బీజేపీని అడ్డుకునేందుకు ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయని మండిపడ్డారు. తన మిత్ర పక్షం మజ్లిస్ కోసమే హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి మూడు ముక్కలు చేశారని ఆరోపించారు.

## పాలు లేకుండా నెయ్యి తీసే టెక్నాలజీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో!: జగన్‌పై మంత్రి అనిత సెటైర్

* టీటీడీ నెయ్యి సరఫరాపై జగన్ ఆరోపణలకు మంత్రి అనిత కౌంటర్
* హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ
* సాక్షి పేపర్, భారతీ సిమెంట్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేసిన అనిత
* వైవీ సుబ్బారెడ్డి హయాంలోనే నెయ్యి కల్తీ జరిగిందని తీవ్ర ఆరోపణలు
* కల్తీని వదిలేసి హెరిటేజ్‌పై బురద జల్లడమేంటని జగన్‌పై ఫైర్

తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా అంశంలో వైసీపీ అధినేత జగన్ ఇవాళ మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు సమస్య అయిన కల్తీని పక్కనపెట్టి, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై జగన్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె, జగన్



వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

### * హెరిటేజ్‌కు, ఇందాపూర్‌కు సంబంధమే లేదు

జగన్ ఆరోపిస్తున్నట్లుగా హెరిటేజ్‌కు, ఇందాపూర్ కంపెనీకి ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని అనిత స్పష్టం చేశారు. ఇందాపూర్ అనేది బల్క్ మార్కెటింగ్ చేసే సంస్థ అని, అది చీజ్, పన్నీర్, టెట్రాప్యాక్ పాలు వంటి ఉత్పత్తులను తయారు చేసి హెరిటేజ్ వంటి కంపెనీలకు విక్రయిస్తుందని వివరించారు. హెరిటేజ్ సంస్థ నేరుగా వినియోగదారులకు మాత్రమే నెయ్యిని విక్రయిస్తుందని, ఎన్నడూ బల్క్‌గా ట్యాంకర్ల ద్వారా ఇతర కంపెనీలకు సరఫరా చేయలేదని తెలిపారు. "హెరిటేజ్ నుంచి ఇందాపూర్‌కు నెయ్యి వెళ్లి, అక్కడి నుంచి టీటీడీకి వస్తుందని చెప్పడానికి కనీసం బుర్ర పనిచేస్తుందా?" అని ఆమె ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ తన సిద్ధాంతాల ప్రకారం దేవాలయాలకు బల్క్‌గా సరఫరా చేయదని, ఈ విషయం చిన్నపిల్లవాడిని అడిగినా చెబుతాడని అన్నారు.

### * ధరల పెరుగుదలపై చిన్న లాజిక్ మిస్సయ్యారు

2015లో రూ.280 ఉన్న నెయ్యి ధర, 2026 నాటికి రూ.650కి ఎందుకు పెరిగిందని జగన్ ప్రశ్నించడాన్ని అనిత తప్పుబట్టారు. కాలంతో పాటు ధరలు పెరగడం సహజమని, ఈ చిన్న లాజిక్‌ను జగన్ ఎలా విస్మరించారని ఆమె ప్రశ్నించారు. "మీరు సాక్షి పేపర్ ప్రారంభించినప్పుడు దాని ధర రూ.2, ఇప్పుడు రూ.6.50. భారతీ సిమెంట్ బస్తా ధర రూ.250 నుంచి రూ.450కి పెరిగింది. 2015లో రూ.19 ఉన్న పాల ప్యాకెట్ ఇప్పుడు రూ.40కి చేరింది. పాల ధర పెరిగితే నెయ్యి ధర పెరగదా? బహుశా పాలు లేకుండానే నెయ్యి తయారుచేసే టెక్నాలజీ మీ తాడేపల్లి ప్యాలెస్‌లో ఉందేమో" అని ఆమె వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటకలో పాల ధరలు అధికంగా ఉండటం వల్లే నందిని డైరీ టీటీడీకి రూ.700కు నెయ్యి సరఫరా చేసిందని, ఆ విషయం గురించి జగన్ ఎందుకు మాట్లాడరని నిలదీశారు.

### * అసలు దొంగ మీ బాబాయే

అసలు సమస్య అయిన నెయ్యి కల్తీ గురించి మాట్లాడకుండా, జగన్ సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని అనిత ఆరోపించారు. నెయ్యి కల్తీ జగన్ ప్రభుత్వ హయాంలో, ఆయన బాబాయి వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే జరిగిందని అనిత తీవ్ర ఆరోపణలు చేశారు. "నెయ్యిలో రసాయనాలు కలిశాయని సిట్, ఎన్డీబీ రిపోర్టులు స్పష్టంగా తేల్చాయి. కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా అప్పటి మీ ప్రభుత్వం ఆ కంపెనీ టెండర్‌ను ఎందుకు రద్దు చేయలేదు? ఎందుకు ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టలేదు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కల్తీ జరిగిందని చార్జ్‌షీట్‌లో ఉన్నా, మీ బాబాయి స్వయంగా అంగీకరించినా దాని గురించి మాట్లాడకుండా, ముక్కు ఎక్కడ ఉందంటే చుట్టూ తిప్పి చూపినట్లు హెరిటేజ్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

### * టెండర్ నిబంధనలు మార్చిందెవరు?

కేవలం తమకు నచ్చిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్ ప్రభుత్వం టెండర్ నిబంధనలను నీరుగార్చిందని అనిత ఆరోపించారు. "ఒక చుక్క పాలు కూడా సేకరించని కంపెనీలు కూడా నెయ్యి సరఫరా చేసేలా నిబంధనలను మార్చారు. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తగ్గించారు. ఇవన్నీ ఎవరికోసం చేశారు? కల్తీపై చర్చకు మేము సిద్ధం. ఆధారాలు చూపించమన్నందుకే ప్రజలకు ఈ వాస్తవాలు వివరిస్తున్నాం. దమ్ముంటే కల్తీ గురించి మాట్లాడండి" అని జగన్‌కు ఆమె సవాల్ విసిరారు.

# రఫేల్‌తో భారత రక్షణ రంగం మరింత బలోపేతం: మెక్రాన్

భారత్ ఫ్రాన్స్‌ల మధ్య రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు అంశాన్ని (Rafale Deal) ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్వాగతించారు. ఈ వ్యవహారంపై వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. ఈ యుద్ధ విమానాలు భారత్‌ను బలీయమైన సైనిక శక్తిగా మారుస్తాయని తెలిపారు. అదేవిధంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందిస్తాయని ఓ జాతీయ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ''భారత ప్రభుత్వానికి, దసో ఏవియేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చల్లో రఫేల్ కొనుగోళ్లు ఓ భాగం. దీనిపై ఎందుకు విమర్శలు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఎందుకంటే ఈ డీల్ భారత్‌ను సైనికపరంగా మరింత శక్తిమంతం చేస్తుంది. స్థానికంగా మరిన్ని



ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇటీవల భారత్ ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచాలని నిర్ణయించాం. ఇందులో రఫేల్ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుంది'' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 'రక్షణ కొనుగోళ్ల మండలి' (డీఏసీ) ఇటీవల ఆమోదముద్ర వేసింది. ఈ ఫైటర్ జెట్‌ల తయారీలో 'మేక్ ఇన్ ఇండియా' పరికరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్‌నాథ్ సింగ్ ఫ్రాన్స్‌ను కోరారు. దీనిపై మెక్రాన్ మాట్లాడుతూ.. రక్షణ ఉత్పత్తుల్లో గరిష్ఠ సంఖ్యలో భారతీయ విడిభాగాలు వాడేందుకు, కీలక పరికరాలను భారత్‌లో తయారు చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

## 'సర్'కు సిద్ధంగా ఉండండి
# 22 రాష్ట్రాలకు ఈసీ లేఖ



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను దేశ వ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించిన సన్నాహకాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. దేశ వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలని గతేడాది జూన్‌లో నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే బిహార్‌లో 'సర్' పూర్తి కాగా.. ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అస్సాంలో మాత్రం ఎస్ఐఆర్‌కు బదులు 'ప్రత్యేక సవరణ' పేరుతో ఓటరు జాబితా సవరణను పూర్తి చేశారు.

## పంచుకుంటూ పోతే ఒక్క పైసా మిగలదు
# తమిళనాడు 'ఉచిత విద్యుత్'పై సుప్రీం ఆగ్రహం

ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ముందే రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి పథకాలు ఎందుకు తీసుకొస్తున్నాయని ప్రశ్నించింది. దేశాభివృద్ధికి ఆటంకం కలిగించే ఈ తరహా విధానాలపై పునఃసమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది (Supreme Court on freebies). తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం (Supreme Court) ఈ వ్యాఖ్యలు చేసింది. వినియోగదారుల ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు (Tamil Nadu) పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఇందుకోసం 2024 ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గురువారం విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ''చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతున్నప్పటికీ ఉచిత పథకాల పంపిణీ కొనసాగుతోంది. ఇలాంటి పథకాలతో రాష్ట్రాలతో పాటు దేశాభివృద్ధికి విఘాతం కలుగుతోంది. ఆహారం, విద్యుత్.. ఇలా అన్నీ ఉచితంగా ఇస్తూ పోతుంటే మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాం? సంక్షేమ చర్యల్లో భాగంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించే స్థోమత లేనివారికి ఉచిత విద్యుత్ అందిస్తారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచితంగా విద్యుత్



పంపిణీ చేస్తామని చెబుతున్నారు. ఇది బుజ్జగింపు రాజకీయ విధానం కాదా?'' అని ధర్మాసనం ప్రశ్నించింది. విద్యుత్ టారిఫ్‌లను నోటిఫై చేసిన తర్వాత ఉన్నట్టుండి ఉచిత విద్యుత్‌పై ప్రకటన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని సీజేఐ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల ముందే రాష్ట్రాలు ఇలాంటి పథకాలు ఎందుకు తీసుకొస్తున్నాయని ఆగ్రహించింది. ఇలా ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొంది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌కు బదులు ఉపాధి సృష్టి కోసం కృషి చేయాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ పిటిషన్‌పై కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

## క్రికెట్ మ్యాచ్‌లో తేనెటీగల దాడి.. అంపైర్ మృతి

క్రికెట్ మ్యాచ్ జరుగుతుండగా తేనెటీగలు దాడి చేసిన ఘటనలో ఓ అంపైర్ మృతి చెందాడు. పలువురు క్రీడాకారులకు గాయాలయ్యాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాన్పుర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్లాగంజ్ ప్రాంతంలోని ఓ మైదానంలో అండర్ 13 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్ జరుగుతుండగా.. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో క్రికెటర్లు, సిబ్బంది భయాందోళనలకు గురై పరుగులు పెట్టారు. ఈ క్రమంలో మ్యాచ్‌లో అంపైర్‌గా వ్యవహరించిన మాణిక్ గుప్తా (65) తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బాధితుడిని కాన్పుర్ ఆసుపత్రికి



తరలించగా వైద్యులు ఆయన మృతి చెందినట్లు ప్రకటించారు. తేనెటీగల దాడిలో మరో అంపైర్ జగదీశ్ శర్మతోపాటు 10-15 మంది క్రీడాకారులకు గాయాలయ్యాయి. క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎన్ సింగ్ ఈ ఘటనను ధ్రువీకరించారు. మృతుడి కుటుంబానికి సంతాపం ప్రకటించారు.

## మాతో ఒప్పందం చేసుకోండి.. లేదంటే..: ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

అణు కార్యక్రమానికి సంబంధించి ఇరాన్ తప్పనిసరిగా తమతో ఒప్పందం చేసుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) స్పష్టం చేశారు. లేదంటే పరిస్థితులు మరింత దిగజారుతాయని హెచ్చరించారు. ఇప్పటికే పశ్చిమాసియాలో సైన్యాన్ని మోహరిస్తున్నామని, ఒప్పందం చేసుకోలేదంటే దీన్ని మరింత ముందుకు వెళ్తామన్నారు. 'బోర్డ్ ఆఫ్ పీస్' (Board of Peace) కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మరో 10 రోజుల్లో దాని ఫలితాన్ని మీరే చూస్తారని ఇరాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. భారత్‌పాక్‌ల మధ్య సైనిక ఉద్రిక్తతలను తగ్గించడంలో



తన కృషి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) మరోసారి పేర్కొన్నారు. ఘర్షణలు ఉద్ధృతంగా కొనసాగుతున్న వేళ ఇరు దేశాధినేతలతో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించుకోకపోతే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనని వారికి స్పష్టం చేశానని, 200శాతం సుంకాలు విధిస్తానంటూ బెదిరించినట్లు తెలిపారు. ఈ యుద్ధం ఆపడం ద్వారా 2.5కోట్ల మంది ప్రాణాలను రక్షించారని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనతో చెప్పారని అన్నారు. ప్రధాని మోదీ బాగా తెలుసునని, ఆయన గొప్ప వ్యక్తి అని ట్రంప్ పేర్కొన్నారు.

# నెవిటేర్ ఎఫెక్ట్..
# విమాన సర్వీసులకు అంతరాయం



ఢిల్లీ, ముంబయి సహా దేశవ్యాప్తంగా ఉన్న పలు ఎయిర్‌పోర్టుల్లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దాంతో వందలమంది ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. నెవిటేర్ వ్యవస్థలో 45 నిమిషాల పాటు సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం 6.45 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. బుకింగ్, చెక్ఇన్ కోసం ఎయిర్‌లైన్ సంస్థలు ఉపయోగించే నెవిటేర్ వ్యవస్థలో ఈ సమస్యను గుర్తించారు. గంటలోపే దానిని పరిష్కరించారు. అయితే ఈ సమయంలో సిబ్బంది బుకింగ్, చెక్ఇన్‌లను మాన్యువల్‌గా నిర్వహించాల్సి వచ్చింది. దాంతో రద్దీ భారీగా పెరిగింది. ముంబయిలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. దాంతో ఇండిగో, ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులపై ప్రభావం పడింది. రిజర్వేషన్లు, చెక్ఇన్, బోర్డింగ్ కోసం కీలకమైన ఎయిర్‌లైన్ టెక్నాలజీని నెవిటేర్ అందిస్తోంది. అది విఫలమైతే.. ప్యాసింజర్ వివరాలను ప్రాసెస్ చేయడంలో అంతరాయం ఏర్పడుతుంది. ఇది రద్దీకి దారితీస్తుంది. కాగా.. గత నవంబర్‌లో ఢిల్లీలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా 800కు పైగా విమానాలు ఆలస్యమైన సంగతి తెలిసిందే. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ విమానాశ్రయం రోజుకు 1500 విమాన సర్వీసుల్ని నిర్వహిస్తోంది. ముంబయి విమానాశ్రయం నిర్వహించే సర్వీసుల సంఖ్య 1000.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం.. బ్రిటన్ రాజు ఛార్లెస్ సోదరుడి అరెస్ట్

ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. వాటిల్లో పలువురు ప్రముఖుల పేర్లు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఫైళ్లలో బ్రిటన్ రాజు సోదరుడు ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండ్సర్ పేరు కూడా ఉండటంతో అక్కడ రాజకీయంగా దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అరెస్టు చేసినట్లు గురువారం యూకే పోలీసులు వెల్లడించారు. పదవీ దుర్వినియోగం ఆరోపణల కింద ఒక వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నామని పేర్కొన్నారు. మాజీ యువరాజు పేరు చెప్పకుండా ఈ అరెస్టు గురించి ప్రకటించారు ఆండ్రూ.. బ్రిటన్‌రాజు ఛార్లెస్‌కు స్వయానా సోదరుడు. ఎప్‌స్టీన్ ఫైళ్లలో పేరు వెలువడినప్పటినుంచి ఆండ్రూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. తనపై మూడుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని ఒక బాధితురాలు (లైంగిక దాడికి గురైన సమయంలో ఆమె వయసు 17) ఆరోపించింది. ఆ పరిణామాల నేపథ్యంలో కొన్ని నెలల క్రితం తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను ఆండ్రూ వదులుకోవాల్సి వచ్చింది. అన్ని రాజ బిరుదులు, గౌరవాలు, అధికారాలను రాజు చార్లెస్ తొలగించారని బకింగ్‌హామ్ ప్యాలెస్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దాంతోపాటు ఆయన్ను బలవంతంగా ఇంటి నుంచి పంపించేశారు. ఈ కేసులో కఠినచర్యలు అనివార్యమని రాజు భావిస్తున్నట్లు సమాచారం.



ఈ సందర్భంగా రాజు చార్లెస్, రాణి కెమిల్లా.. బాధితుల వైపే ఉంటారని రాజభవన వర్గాలు స్పష్టం చేశాయి.

# దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి జీవిత ఖైదు

దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు జీవిత ఖైదు పడింది. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దేశంలో మార్షల్ లా విధించిన కేసులో తీర్పు వెలువడింది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు సైన్యం, పోలీసు బలగాలను సమీకరించినందుకుగానూ తిరుగుబాటు కింద ఆయన్ను దోషిగా నిర్ధరించినట్లు న్యాయమూర్తి జీ కుయ్‌యోన్ తెలిపారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో



గంటల వ్యవధిలోనే ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవి కోల్పోయారు. 'మార్షల్ లా' విషయంలో ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించాయని ఆరోపిస్తూ.. ఆయనకు మరణశిక్ష విధించాలని ప్రత్యేక ప్రాసిక్యూటర్ వాదించారు. చివరకు కోర్టు జీవిత ఖైదు విధించింది. 'మార్షల్ లా' అమలులో భాగమైన అనేక మంది మాజీ సైనిక, పోలీసు అధికారులకూ కోర్టు శిక్ష విధించింది. రక్షణశాఖ మాజీ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష పడింది. అనేక కేసులు ఎదుర్కొంటున్న యూన్ సుక్ యోల్ గతేడాది జులై నుంచి జైల్లో ఉన్నారు. ఓ కేసులో గత నెలలో ఆయనకు ఐదేళ్ల శిక్ష పడింది. మరోవైపు.. జీవిత ఖైదు పడిన మొదటి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు ఆయనే కావడం గమనార్హం. ఈ తీర్పుపై ఆయన అప్పీల్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన..
# పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

* **లేపాక్షి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన బాలకృష్ణ**
* **మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు బీటీ రోడ్డు పనులకు భూమిపూజ**
* **రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం**
* **పులమతి చెరువులో హంద్రీనీవా జలాలకు జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే**



శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం లేపాక్షి మండలంలో పర్యటించిన ఆయన, రెండు కీలకమైన బీటీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే, మండలంలోని మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం ఆయన పులమతి చెరువు వద్దకు చేరుకుని, హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఇదే పర్యటనలో భాగంగా కొత్తపల్లి నుంచి నాగేపల్లి వరకు నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలో రవాణా, సాగునీటి రంగాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా బాలకృష్ణ స్పష్టం చేశారు.

# 'ఘోస్ట్ ఉద్యోగి'కి.. వేతన రూపంలో రూ.10 కోట్లు!

అమెరికాలో ఓ భారత సంతతి వ్యక్తి చేసిన మోసం వెలుగు చూసింది. తప్పుడు పత్రాలతో తన స్నేహితుడిని నియమించుకొని సంస్థకు 1.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.10 కోట్లు) మేర నష్టం కలిగించినట్లు తేలింది. పని చేయకున్నా వేతనంతోపాటు ఇతర సదుపాయాలు పొందడం గమనార్హం. 'ఘోస్ట్ ఉద్యోగి' వ్యవహారంపై దర్యాప్తు జరిపిన న్యాయస్థానం.. అతడు అధికార దుర్వినియోగంతో సంస్థను మోసం చేసినట్లు నిర్ధరించింది. భారత సంతతికి చెందిన కరణ్ గుప్తా.. మిన్నెసోటాలోని యునైటెడ్‌హెల్త్ గ్రూప్ అనుబంధ సంస్థ 'ఆప్టమ్'లో సీనియర్ డైరెక్టర్‌గా చేశాడు. వార్షిక వేతనం 2.60లక్షల డాలర్ల కంటే ఎక్కువే. ఈ క్రమంలో కొన్నేళ్లక్రితం తన చిరకాల మిత్రుడిని ఆ సంస్థలో చేర్చుకోవాలని భావించాడు. అతడికి అర్హత లేకున్నా తప్పుడు దస్త్రాలు (రెజ్యూమె సహా ఇతర) సృష్టించి 2015లో ఉద్యోగిగా నియమించుకున్నాడు. తన టీమ్‌లోనే



పనిచేసేలా కేటాయించుకున్నాడు. అతడి మిత్రుడు సంస్థలో పనిచేయకున్నా ప్రారంభంలో లక్ష డాలర్లకుపైగా వార్షిక వేతనం అందేది. ప్రతి ఏటా జీతం పెంపుతో పాటు బోనస్‌లను కూడా పొందాడు. ఉద్యోగిగా వేతనం పొందుతున్నప్పటికీ ఆ సంస్థలో ఒక్క సహోద్యోగినీ కలవలేదు. ఆయనకు సంబంధించి ఒక్క మెయిల్ లేదు. అసలు అతనికి కేటాయించిన కంప్యూటర్‌లో లాగిన్ కూడా కాలేదు. అయితే, అతడి స్నేహితుడికి వచ్చే జీతంలో సగానికిపైగా గుప్తా ఖాతాలోకి చేరేవి. న్యూజెర్సీలో ఉండే ఆ స్నేహితుడు నగదు విత్‌డ్రా చేసి గుప్తా అకౌంట్‌లో వేసేవాడు. అయితే, 2019 నవంబర్‌లో ఓ మోసం కేసులో గుప్తాను ఆ సంస్థ ఉద్యోగం నుంచి తొలగించింది. అదే సమయంలో ఈ వ్యవహారం బయటపడింది. సంస్థ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థలు.. మొత్తంగా దాదాపు 1.2 మిలియన్ డాలర్లు (సుమారు రూ.10 కోట్లు) మోసం చేయడంతోపాటు, మనీలాండరింగ్ కుట్ర ఉన్నట్లు పేర్కొన్నాయి. అధికార దుర్వినియోగానికి పాల్పడిన గుప్తా.. ఘోస్ట్ ఉద్యోగిని నియమించుకొని సంస్థను మోసగించినట్లు న్యాయస్థానం నిర్ధరించింది. ఈ వ్యవహారానికి సంబంధించి న్యాయశాఖ పూర్తి వివరాలు వెల్లడించింది.

# కేరళ స్టోరీ-2కు 'యూ/ఏ' సర్టిఫికేట్ జారీ



**టాకీస్:** మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## హీరోగా ఎంట్రీ ఇస్తున్న రామ్‌చరణ్ మేనేజర్ కొడుకు



**టాకీస్:** టాలీవుడ్ నుంచి హీరోల వారసులే కాకుండా, వారి వెన్నంటి ఉండే సన్నిహితుల కుటుంబాల నుంచి కూడా కొత్త టాలెంట్ వస్తుంటుంది. తాజాగా రామ్ చరణ్ డేట్స్, ఇతర సినిమా వ్యవహారాలను దశాబ్ద కాలంగా చూసుకుంటున్న ఆయన మేనేజర్ ప్రవీణ్ కుమారుడు దృషిక్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. దృషిక్ చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో లండన్‌లోని ఒక ప్రముఖ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ఇప్పుడు ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ సిరీస్ అయిన 'మ్యాడ్' ఫ్రాంచైజీలో రాబోతున్న 'మ్యాడ్ 3' చిత్రంలో దృషిక్ ఒక హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లో దృషిక్‌కి అవకాశం రావడం విశేషం. రామ్ చరణ్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ కుమారుడు కావడంతో, ఈ కుర్రాడికి మెగా ఫ్యామిలీ మద్దతు కూడా ఉండవచ్చని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటనతో పాటు డ్యాన్స్, ఫిట్‌నెస్‌లో కూడా దృషిక్ ఇప్పటికే మంచి పట్టు సాధించినట్లు సమాచారం.

## ఛత్రపతి శివాజీగా రితేష్ దేశ్‌ముఖ్..



'రాజా శివాజీ' ఫస్ట్ లుక్ విడుదల

**టాకీస్:** మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బాలీవుడ్ నటుడు, దర్శకుడు రితేష్ దేశ్‌ముఖ్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాజా శివాజీ' గురించి కీలక ప్రకటన చేశాడు. శివాజీ జయంతి సందర్భంగా అతడికి నివాళులు అర్పిస్తూ.. చిత్రం యొక్క ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడంతో పాటు, సినిమా విడుదల తేదీని కూడా ప్రకటించాడు. రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రను పోషిస్తూ, ఈ చిత్రానికి దర్శకత్వం కూడా వహిస్తుండగా.. రితేష్ భార్య, ప్రముఖ నటి జెనీలియా దేశ్‌ముఖ్ (ముంబై ఫిల్మ్ కంపెనీ), జియో స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం 2026 మే 1న (మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. మరాఠీ, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ మరియు మలయాళ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కాబోతున్నట్లు సమాచారం.

ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్ విజువల్స్ ఈ సినిమాకు అందిస్తుండగా, అజయ్-అతుల్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్రంలో సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. మరాఠా సామ్రాజ్య స్థాపకుడు శివాజీ మహారాజ్ వీరగాథను, ఆయన 'స్వరాజ్యం' కోసం చేసిన పోరాటాన్ని ఈ చిత్రం కళ్లకు కట్టినట్లు చూపించనుంది.



## మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్

టాకీస్: టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

MOVIE TIME

## విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్



**టాకీస్:** మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

**టాకీస్:** తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈ చిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.